بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّيْ عَلٰى رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰى عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

وَلَقَدْ نَصَرَكُمُ اللّٰهُ بِبَدْرٍ وَّاَنْتُمْ اَذِلَّةٌ

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly BADAR Qadian

సంపుటి: 11 www.akhbarbadr.in సంచిక: 27

సంపాదకులు: హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్,
ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్.

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

إِنَّ اللّٰهَ وَمَلٰٓئِكَتَهٗ يُصَلُّوْنَ عَلَى النَّبِيِّ ۭ يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا صَلُّوْا عَلَيْهِ وَسَلِّمُوْا تَسْلِيْمًا ﴿سورة الاحزاب:57﴾

అనువాదం: నిశ్చయముగా అల్లాహ్ మరియు అతని దేవదూతలు ఈ సందేశహరుడిపై దయానుగ్రహములు పంపుదురు. (కావున) ఓ విశ్వాసులారా! మీరు కూడ ఈ సందేశహరుడిపై తరుచుగా దరూద్ మరియు శాంతి (దుఆ) ని పంపుము.

**(అహ్జాబ్ : 57)**

**తేది: 02 జులై 2026 క్రీ, శ. 02 వఫా 1405 హి, శ. 16 ముహర్రం 1448 హి,ఖ.**

## ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు:

## దుఆలు ఆమోదించబడుటకు దరూద్ షరీఫ్‌ను తప్పక పఠించాలి.

عَنْ فَضَالَةَ بْنِ عُبَيْدٍ، قَالَ: بَيْنَا رَسُولُ اللّٰهِ صَلَّى اللّٰهُ عَلَيْهِ وَسَلَّمَ قَاعِدًا إِذْ دَخَلَ رَجُلٌ فَصَلَّى، فَقَالَ: اللّٰهُمَّ اغْفِرْ لِي وَارْحَمْنِي، فَقَالَ رَسُولُ اللّٰهِ صَلَّى اللّٰهُ عَلَيْهِ وَسَلَّمَ: "عَجِلْتَ أَيُّهَا الْمُصَلِّي، إِذَا صَلَّيْتَ فَقَعَدْتَ فَاحْمَدِ اللّٰهَ بِمَا هُوَ أَهْلُهُ، وَصَلِّ عَلَيَّ ثُمَّ ادْعُهُ". قَالَ: ثُمَّ صَلَّى رَجُلٌ آخَرُ بَعْدَ ذَلِكَ، فَحَمِدَ اللّٰهَ وَصَلَّى عَلَى النَّبِيِّ صَلَّى اللّٰهُ عَلَيْهِ وَسَلَّمَ، فَقَالَ النَّبِيُّ صَلَّى اللّٰهُ عَلَيْهِ وَسَلَّمَ: "أَيُّهَا الْمُصَلِّي ادْعُ تُجَبْ". قَالَ أَبُو عِيسَى: وَهَذَا حَدِيثٌ حَسَنٌ، وَقَدْ رَوَاهُ حَيْوَةُ بْنُ شُرَيْحٍ، عَنْ أَبِي هَانِئٍ الْخَوْلَانِيِّ، وَأَبُو هَانِئٍ اسْمُهُ حُمَيْدُ بْنُ هَانِئٍ، وَأَبُو عَلِيٍّ الْجَنْبِيُّ اسْمُهُ عَمْرُو بْنُ مَالِكٍ.

హజ్రత్ ఫజలా ఇబ్ను ఉబైద్ (రజియల్లాహు అన్హు) ఇలా ఉల్లేఖించారు: నేను ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి సమక్షంలో కూర్చుని ఉండగా, ఒక వ్యక్తి వచ్చి నమాజ్ చదివి, ఆ తరువాత అల్లాహుమ్మగ్ఫిర్‌లీ వర్‌హమ్‌నీ అని దుఆ చేశాడు. అనగా "ఓ అల్లాహ్! నన్ను క్షమించు మరియు నాపై కరుణ చూపు." అప్పుడు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: "ఓ నమాజ్ చేసే వ్యక్తి! నీవు తొందర పడ్డావు. నీవు నమాజ్ పూర్తి చేసి దుఆ కోసం కూర్చున్నప్పుడు, ముందుగా అల్లాహ్‌ను స్తుతించాలి మరియు ఆయన మహిమను కొనియాడాలి. ఆ తరువాత నాపై దరూద్ పంపాలి. తరువాత నీకు కావలసినదేదైనా అల్లాహ్‌ను ప్రార్థించాలి." కథకుడు ఇలా తెలిపాడు. ఆ తరువాత మరొక వ్యక్తి వచ్చి అల్లాహ్‌ను స్తుతించాడు మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారిపై దరూద్ పంపాడు. అప్పుడు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: అయ్యుహల్ ముసల్లీ ఉద్‌ఉ తుజబ్ అనగా "ఓ నమాజ్ చేసే వ్యక్తీ! దుఆ చేయి; అది స్వీకరించబడుతుంది."

**(సునన్ తిర్మిజి, అబువాబు ద్దఅవాత్, బాబ్ మాజాఅ ఫీ జామిఉస్వలాత్, అనినబియ్యి సల్లల్లాహు అలైహి వసల్లం, హదీస్ సంఖ్య 3476)**

## హుసైన్ (రజియల్లాహు అన్హు) పవిత్రుడు, పరిశుద్ధీకరించబడినవాడు. నిస్సందేహంగా వారు స్వర్గ నాయకులలో ఒకరు.

**(ఉపదేశములు: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం)**

**హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ ( మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని గారు) అలైహిస్సలాతు వస్సలాం ఇలా పేర్కొన్నారు:** "యజీద్ అపవిత్ర స్వభావం గలవాడు, ప్రాపంచిక ప్రలోభకుడు మరియు దుర్మార్గ పాలకుడు అని మేము విశ్వసిస్తున్నాము. ఒక నిజమైన విశ్వాసి (ముమిన్)కి ఉండవలసిన లక్షణాలు, భావరీతిలో కూడ అతనిలో లేవు. నిజమైన విశ్వాసిగా మారడం అంత సులభమైన విషయం కాదు. అలాంటి వారి గురించి అల్లాహ్ తఆలా ఇలా తెలిపాడు: قَالَتِ الْاَعْرَابُ اٰمَنَّا ۭ قُلْ لَّمْ تُؤْمِنُوْا وَلٰكِنْ قُوْلُوْٓا اَسْلَمْنَا అనగా, 'ఎడారి అరబ్బులు, "మేము విశ్వసించాము" అని అంటున్నారు. వారికి చెప్పు: "మీరు ఇంకా విశ్వసించలేదు; 'మేము విధేయులమయ్యాము' అని చెప్పండి. ఎందుకంటే విశ్వాసం ఇంకా మీ హృదయాలలో ప్రవేశించలేదు." **(హుజ్‌రాత్: 15)** విశ్వాసులు అనగా....... తమ హృదయాలలో విశ్వాసం లిఖించబడినవారు. అన్ని అంశాలపై తమ ప్రభువుకు, ఆయన ప్రీతికి ప్రాధాన్యతను కల్పిస్తారు. దేవుని కొరకు ధర్మమార్గంలోని సూక్ష్మమైన మరియు కఠినమైన మార్గాలను ఎంచుకుంటారు. ఆయన ప్రేమలో పూర్తిగా లీనమైపోతారు. అలాగే విగ్రహంలా వారిని దేవుని నుండి దూరం చేసే ప్రతి విషయానికి, అది చెడు నైతిక లక్షణాలైనా, పాపకార్యాలైనా, నిర్లక్ష్యమైనా లేదా సోమరితనమైనా, దూరంగా ఉంటారు. కానీ దురదృష్టవంతుడైన యజీద్‌లో ఈ లక్షణాలు ఎలా ఉండ గలవు?. ప్రాపంచిక ప్రేమ అతనిని అంధుడిని చేసింది. కాని హుసైన్ (రజియల్లాహు అన్హు) విషయానికి వస్తే, ఆయన పవిత్రుడు, పరిశుద్ధీకరించబడినవాడు. నిస్సందేహంగా, వారు అల్లాహ్ స్వహస్తాలతో శుద్ధి చేయబడి, అల్లాహ్ ప్రేమను నింపబడి ఎంపిక చేయబడిన వారిలో ఒకరు. నిస్సందేహంగా వారు స్వర్గ నాయకులలో ఒకరు. వారి పట్ల అణువంత ద్వేషం కలిగి ఉండటం కూడా విశ్వాసాన్ని కోల్పోవుటకు కారణమవుతుంది. ఈ ఇమామ్ యొక్క దైవభీతి, అల్లాహ్ ప్రేమ, సహనం, స్థైర్యం, వైరాగ్యం మరియు ఆరాధన మనకు అత్యుత్తమ ఆదర్శం."

**(మజ్మూఅ ఇష్తిహారాత్, సంపుటి 3, పుటలు 548-550, ప్రకటన సంఖ్య 263, షిర్కతుల్ ఇస్లామియ్యా, రబ్వా ప్రచురణ)**

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక ఫార్సీ పద్య పంక్తిలో ఇలా అన్నారు:

جان و دلم فدائے جمال محمدؐ است　　خاکم نثار کوچۂ آلِ محمدؐ است

" ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి సౌందర్యానికి నా ప్రాణమూ, నా హృదయమూ అంకితం - ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి కుటుంబం కొరకు నా ఉనికి యొక్క రేణువులన్నియు అర్పితం."

**(దుర్రె-సమీన్ ఫార్సీ, పుట 89)**

## అల్లాహ్ తాలా ఇమామ్ హుసైన్ (రజి) హంతకుల ప్రతీకారం తీర్చుకున్నాడు.

సయ్యదినా హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ ఖలీఫతుల్ మసీహుస్సాని (రజి ) గారు ఇలా పేర్కొన్నారు: చారిత్రక సంఘటనలు చూసినట్లయితే తెలియునదేమనగా, కర్బలా విషాద ఘటన అనంతరం సర్వశక్తిమంతుడు అల్లాహ్ ఇమామ్ హుసైన్ (రజి) హంతకులను పట్టుకొని వారికి భయంకరమైన శిక్షలు విధించాడు. అయితే ఒక దుర్మార్గుడి వారసులు తమ పూర్వీకులు చేసిన అన్యాయాలను, తప్పులను అంగీకరించి, వారి వారసత్వాన్ని కొనసాగించడానికి తిరస్కరించడమనేదాన్ని దైవ ప్రతీకారానికి మరో రూపంగా చెప్పుకో వచ్చును. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు తాలా అన్‌హు గారు తమ పుస్తకం "ఖిలాఫత్-ఎ-రాషిదా"లో యజీద్ మరణం తర్వాత జరిగిన ఒక సంఘటనను ప్రస్తావిస్తూ ఇలా వ్రాశారు: "యజీద్ మరణించిన తర్వాత అతని కుమారుడు సింహాసనాన్ని అధిష్ఠించాడు. తన తాత వలే అతనికీ కూడ ముఆవియా అనే పేరు ఉండేది. ప్రజల నుండి బైఅత్ తీసుకున్న తరువాత అతను తన ఇంటికి వెళ్లి నలభై రోజుల పాటు బయటకు రాలేదు. అనంతరం ఒక రోజు బయటకు వచ్చి మింబర్ పై నిలబడి ప్రజలను ఉద్దేశించి ఇలా అన్నాడు:- "నేను మీ నుండి బైఅత్ తీసుకున్నది నేను ఈ పదవికి అర్హుడిని అని భావించి కాదు. కేవలం మీ మధ్య విభేదాలు తలెత్తకూడదనే ఉద్దేశంతో మాత్రమే.

**(10వ పేజిలో చదువుము)**

**అహ్మదియ్యా వార్తలు**

**సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ దయతో క్షేమంగా ఉన్నారు. జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్య వంతమైన, చురుకైన, దీర్ఘాయుష్షును ప్రసాదించుగాకా!. ఉన్నత ఆశయ సాధనాలను సమకూర్చు గాకా!, అనుక్షణం హుజూర్‌ను రక్షించుగాకా!, దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).***

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

సంపాదకీయం: لَا اِلٰہَ اِلَّا اللّٰہُ مُحَمَّدٌ رَّسُوْلُ اللّٰہِ

# ప్రాథమిక ప్రశ్నలకు సమాధానాలు:

ఈజిప్టు అజీజ్ భార్య ఆ మహిళలకు కత్తులు ఎందుకు ఇచ్చింది?.

**ప్రశ్న:** యూకేకు చెందిన ఒక మహిళ హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారిని సూరా యూసుఫ్‌లో ప్రస్తావన ఉన్నట్లు, ప్రవక్త యూసుఫ్ (అలైహిస్సలాం) యజమాని భార్య ఆ మహిళల చేతుల్లో కత్తులు ఎందుకు పెట్టిందని అడిగారు. ఒక వ్యాఖ్యాన గమనికలో హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబేహ్ రహ్మహుల్లాహ్ తాలా గారు ఆ మహిళలు ప్రవక్త యూసుఫ్‌ను తమ చేతుల పరిధికి దూరంగా ఉన్నవాడిగా చూశారని, నిజంగా వారు తమ చేతులను కోసుకోలేదని పేర్కొన్నారు. కాబట్టి ప్రశ్న ఏమిటంటే: ఈజిప్టు అజీజ్ భార్య ఆ మహిళలకు కత్తులు ఎందుకు ఇచ్చింది?

హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు 2023 జూలై 7 తేదీ గల తన లేఖలో ఈ విధంగా సమాధానం ఇచ్చారు:

జవాబు: ఈజిప్టు రాజ్యంలోని ప్రముఖులలో అజీజ్ ఒకరు. అతని ఇంటిలో జరిగిన ఆ సమావేశం సాధారణమైనది కాదు. అది ఒక విలాసవంతమైన విందు. అందువల్ల ఆ కాలపు ఆచారాల ప్రకారం భోజనానికి అత్యుత్తమ ఏర్పాట్లు చేసి ఉండే వారు. అందులో భోజనానికి కత్తులు, మరియు ఇతర ఉపకరణాలు ఉండి ఉండ వచ్చు లేదా పండ్లు కోయడానికి అతిథుల ముందు కత్తులు ఉంచి ఉండవచ్చు.

ఈ సందర్భంలో హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ రజియల్లాహు తాలా అన్‌హు గారు ఈ ఆయత్‌లోని సిక్కీన్ అనే పదాన్ని వివరిస్తూ ఇలా చెప్పారు: “కత్తి పండ్లు కోయడానికి.”

**(హకాయికుల్ ఫుర్ఖాన్, సంపుటం 2, పుట 392)**

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహ్ తాలా అన్‌హు గారు కత్తులు ఎందుకు ఉంచారో వివరిస్తూ ఇలా చెప్పారు: “ఆమె వారిని భోజనానికి లేదా అల్పాహారానికి ఆహ్వానించింది. ఒక టేబుల్ ఏర్పాటు చేయబడింది, ప్రతి వ్యక్తి ముందు ఒక కత్తి ఉంచబడింది. (దీనివల్ల భోజనంలో కత్తుల వినియోగం ప్రాచీన కాలం నుంచే ఉందని తెలుస్తుంది; ఈరోజుల మాదిరిగానే ముందుగా కత్తులు ఉంచి తరువాత ఆహార పదార్థాలు తెచ్చేవారు.)”

**(తఫ్సీర్–ఎ–కబీర్, సంపుటం 3, పుట 307, ఖాదియాన్ 2004 ముద్రణ)**

అందువల్ల ఈజిప్టు అజీజ్ భార్య తన స్థాయికి తగినట్లుగా తన స్నేహితుల కోసం ఒక అద్భుతమైన విందు ఏర్పాటు చేసింది. అందులో పండ్లు మరియు ఇతర ఆహార పదార్థాలను కోయడానికి కత్తులు కూడా ఉంచింది.

“వారు తమ చేతులను కోసుకున్నారు” అనే సూక్తుల పదాల విషయానికి వస్తే, ఆ పదానికి రెండు రకాల వివరణలు ఉన్నాయని జమాత్ సాహిత్యంలో చెప్పబడింది. ఒక అర్థం ఏమిటంటే, ప్రవక్త యూసుఫ్ (అలైహిస్సలాం)ను చూసినప్పుడు ఆయన ధర్మం మరియు గొప్పతనం వల్ల వారు ఆశ్చర్యంలో మునిగిపోయి తమ వేళ్లను దంతాల మధ్య పెట్టుకున్నారు. వారి శ్రేష్ఠత వల్ల తమ తప్పుడు ఉద్దేశాలు ఆయనకు దూరంగా ఉన్నాయని గ్రహించారు. మరో వివరణ ప్రకారం, యూసుఫ్ (అలైహిస్సలాం) యొక్క అందం మరియు గౌరవభావం కారణంగా ఆశ్చర్యంలో పండ్లు కోయడం మర్చిపోయి తమ చేతులను కోసుకున్నారు.

హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా వ్రాశారు: “ఆ మునిగి పోయిన స్థితి ప్రభావం వల్ల జులైఖా స్నేహితురాళ్ళు తమ వేళ్లను కోసుకున్నారు.”

**(మక్తూబాత్–ఎ–అహ్మద్, సంపుటం 1, పుట 594, కొత్త ఎడిషన్)**

హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ రజి గారు ఇలా చెప్పారు: “‘వారు తమ చేతులను కోసుకున్నారు’ అనేది ఒక అలంకారిక ప్రయోగం. దీని అర్థం ఆశ్చర్యంతో వారు తమ చేతులను నోటిలో పెట్టుకున్నారు. కొందరు దీన్ని, అందం మరియు ఆశ్చర్యం వల్ల పండ్లకు బదులు తమ చేతులను కోసుకున్నారని కూడా అర్థం చేసుకున్నారు.” **(అఖ్బారే బదర్ 30 డిసెంబర్ 1909, పుట 130)**

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజి తన తఫ్సీర్–ఎ–సఘీర్‌లో ఈ సూక్తికి అనువాదంగా ఇలా చెప్పారు: “వారు అతన్ని చూసినప్పుడు అతను మహోన్నతమైన వ్యక్తిగా కనిపించాడు. ఆశ్చర్యంతో తమ చేతులను కోసుకున్నారు. అంటే తమ వేళ్లను దంతాలతో కొరికారు. మరల చెప్పారు: ‘ఇతను మనిషి కాదు; అల్లాహ్ కోసం చెడుకు దూరంగా ఉండే ఒక గౌరవనీయ దేవదూత మాత్రమే.’”

**(తఫ్సీర్–ఎ–సఘీర్, పుట 293)**

అలాగే తఫ్సీర్–ఎ–కబీర్‌లో ఈ విషయాన్ని వివరిస్తూ రెండు అర్థాలు ఉండ వచ్చని హుజూర్ రజ గారు చెప్పారు: ఒకటి, ప్రవక్త పావనిత్ర్యం మరియు గొప్పతనాన్ని చూసి వారు మునిగిపోయి కొందరికి కత్తుల వల్ల గాయాలు అయ్యాయి; రెండవది, ఆశ్చర్యంతో వేళ్లను కొరికారు. అరబీలో “వేళ్లను కొరుకుట” అనే ప్రయోగం ఆశ్చర్యానికి సంకేతంగా వాడబడుతుంది.

తాల్ముద్‌లో కూడా ఈ విషయం ప్రస్తావించబడింది: అజీజ్ భార్య ఆ మహిళల ముందు పండ్లు ఉంచింది. వారు యూసుఫ్‌ను చూస్తూ మునిగిపోవడంతో నిర్లక్ష్యంగా తమ చేతులకు గాయాలు చేసుకున్నారు. అందువల్ల “చేతులు కోసుకోవడం” అనే పదానికి సందర్భం మరియు భాషాప్రయోగాన్ని బట్టి రెండు వివరణలు సరైనవిగా భావించబడతాయి.

**(రూహాని ఖజాయిన్)**

**ప్రశ్న:** కెనడా నుండి వచ్చిన ఒక మిత్రుడు హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి సేవలో ఒక ప్రశ్న పంపారు. ఆ ప్రశ్న ఏమిటంటే: “రూహాని ఖజాయిన్” అనే గ్రంథాల సమాహారానికి ఆ పేరు ఎవరు పెట్టారు?

అందుకు హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు 11 జూలై 2023 తేదీ గల తన లేఖలో ఈ క్రింది సమాధానాన్ని ఇచ్చారు:

హుజూర్ ఇలా పేర్కొన్నారు:

సమాధానం: సయ్యదిన హజ్రత్ మసీహ్ మౌవూద్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని అలైహిస్సలాం రచించిన పుస్తకాల సమాహారం మొదటగా రెండవ ఖలీఫా హజ్రత్ మిర్జా బషీరొద్దీన్ మహ్మూద్ అహ్మద్ గారి ఖిలాఫత్ కాలంలో 1957లో ప్రచురించబడటం ప్రారంభమైంది. ఆ సమయంలోనే ఈ సమాహారానికి “రూహాని ఖజాయిన్” అనే పేరు పెట్టబడింది. ఈ శ్రేణి ప్రచురణ 1968లో మూడవ ఖిలాఫత్ ప్రారంభ సంవత్సరాలలో పూర్తయింది.

ఈ సమాహారం ప్రచురణ ప్రారంభానికి ముందు మరియు ప్రచురణ జరుగుతున్న సమయంలో, దీని గురించి వివిధ ప్రకటనలు ప్రతిరోజు పత్రిక “అల్–ఫజల్”, రబ్వా లో వివిధ సమయాల్లో ప్రచురించబడ్డాయి. అలాగే సదర్ అంజుమన్ అహ్మదీయా, రబ్వా వార్షిక నివేదికల్లో కూడా దీనిని ప్రస్తావించారు.

**(అల్–ఫజల్, రబ్వా, 17 మార్చి 1957, పుట 8; అల్–ఫజల్, రబ్వా, 20 ఏప్రిల్ 1958, పుట 4; 1957–58 సంవత్సరానికి సదర్ అంజుమన్ అహ్మదీయా వార్షిక నివేదిక, పుట 58)**

అదనంగా, ఈ సమాహారం ప్రచురణ ప్రారంభానికి ముందు, షరీఖత్–ఉల్–ఇస్లామీయ్యా లిమిటెడ్ తరఫున “అల్–ఫజల్” పత్రికలో ఒక ప్రకటన ప్రచురించబడింది. అందులో ఈ శాస్త్రీయ సమాహారం గురించి ఇలా పేర్కొనబడింది: సర్వశక్తిమంతుడైన అల్లాహ్ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంపై ఇలా దైవవాణిని అవతరింపజేశాడు. **ఉక్‌తుబ్ వలియుత్‌బఅ వల్ యుర్‌సల్ ఫిల్ అర్‌జి** అనగా “రాయుము, అది ముద్రించబడుతుంది మరియు భూమి అంతటా పంపబడుతుంది.” అనగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంపై అవతరించిన వహీ (దైవవాణి)లు మరియు జ్ఞానం రాయబడి, ముద్రించబడి ప్రజలకు చేరవేయాలి.

షరీఖత్–ఉల్–ఇస్లామీయ్యా లిమిటెడ్ స్థాపన యొక్క ప్రధాన ఉద్దేశ్యం పవిత్ర ఖుర్‌ఆన్ జ్ఞానాన్ని వ్యాప్తి చేయడం మరియు ఈ యుగపు సంస్కర్త, అహ్మదీయ్య జమాఅత్ స్థాపకుడు అయిన హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంకు అల్లాహ్ ప్రసాదించిన శాస్త్రీయ మరియు ఆధ్యాత్మిక ఖజానాలను ప్రచురించడం.

హుజూర్ (అ) ఇలా తెలిపారు.

وہ خزائن جو ہزاروں سال سے مدفون تھے

اب میں دیتا ہوں اگر کوئی ملے امیدوار

“వేల సంవత్సరాలుగా సమాధిలో పాతిపెట్టబడిన ఖజానాలు
ఇప్పుడు నేను వెలికి తీస్తున్నాను, ఏవరైనా ఆశించే వారు ఉంటే.”

కాబట్టి షరీఖత్–ఉల్–ఇస్లామీయ్యా లిమిటెడ్ షేర్లు కొనుగోలు చేసే మిత్రులు, పై వాక్యంలో ఉన్న దైవ సంకల్పాన్ని నిజంగా నెరవేర్చుతున్నట్లే.

(అల్–ఫజల్, రబ్వా, 23 జూలై 1956, పుట 7)

ఈ శాస్త్రీయ మరియు ఆధ్యాత్మిక పని రెండవ ఖలీఫా హజ్రత్ మిర్జా బషీరొద్దీన్ మహ్మూద్ అహ్మద్ రజి గారి శుభకాలంలో ప్రారంభమైనందున, ఈ సమాహారానికి “రూహాని ఖజాయిన్” అనే పేరు కూడా వారి (రజి) ఆమోదం మరియు మార్గదర్శకత్వంతోనే పెట్టబడినదని నమ్మకంగా చెప్పవచ్చు. ఈ పేరుకు నేపథ్యంగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు పైన పేర్కొన్న కవితా వాక్యమే కావచ్చును.

**(మూలం: అల్ ఫజల్ ఇంటర్నేషనల్, 29 మార్చి 2025 )**

# జుమా ప్రసంగము

**దైవ ఏకత్వాన్ని స్థాపించడానికి దైవ ప్రవక్త (స) మక్కా విగ్రహారాధకుల వంటి శక్తివంతమైన జాతిని ఎదుర్కొని, చివరికి కాబాను 360 విగ్రహాల నుండి శుద్ధి చేశారు. అయితే, అంతటితో ఆగకుండా, ఇస్లాంను స్వీకరించిన వారి హృదయాలలో కూడా తౌహీద్‌ను స్థాపించడానికి ప్రవక్త (స) ఒక మహోన్నతమైన, ఆశీర్వాద పూర్వకమైన పోరాటం (జిహాద్) సాగించారు. తమ ఆధ్యాత్మిక శక్తితో తౌహీద్‌ను మనస్ఫూర్తిగా ప్రేమించే ఒక సమాజాన్ని నిర్మించారు.**

**ప్రవక్త (స) అల్లాహ్ తఆలా యొక్క స్థానాన్ని ఎంతో గౌరవిస్తూ, తన అనుచరులు తనపై ఉన్న అపారమైన ప్రేమ వలన తన స్థాయిని అతిశయింపజేస్తారేమోనని భయపడి, పదే పదే ఇలా పలికారు: 'యూదులు మరియు క్రైస్తవులపై అల్లాహ్ శాపం కలుగుగాకా!. ఎందుకంటే వారు తమ ప్రవక్తల సమాధులను ఆరాధనా స్థలాలుగా మార్చుకున్నారు." .. ఈ విధంగా, వారు (స) తన ప్రజలకు ఇచ్చిన చివరి బోధన ఏమిటంటే: "నన్ను షిర్క్‌కు దారి తీసే స్థాయికి పొగడకండి. మీరు అలా చేస్తే నేను సంతోషిస్తానని అనుకోకండి; అలా చేసే వారిని నా ఆత్మ శపిస్తుంది."**

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 27 మార్చి 2026 ( 27 అమాన్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ- بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ-

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ○

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ ۙ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి జీవితంలోని, ముఖ్యంగా (తౌహీద్) దైవఏకత్వంకు సంబంధించిన సంఘటనల గురించి ఇంతకు ముందు చర్చించబడింది. మక్కా విజయం సందర్భంగా విగ్రహాలను ధ్వంసం చేసిన వివరాలు కూడా గత జుమా ప్రసంగాలలో ప్రస్తావించబడ్డాయి. ప్రవక్త (స) చేసిన ఈ కార్యమంతా అల్లాహ్ ఏకత్వాన్ని ప్రకటించడానికే, ప్రజలు ఆరాధిస్తున్న విగ్రహాల అసలు స్థితి ఏమిటో చూపించడానికే. అందువల్ల, మక్కా పరిసర ప్రాంతాలలో ఉన్న ప్రధాన విగ్రహాలైన మనాత్, ఉజ్జా, సువా మొదలైనవి ధ్వంసం చేయబడడాన్ని మనం చూశాము. తాయిఫ్ ప్రజల విగ్రహమైన లాత్ గురించి ఒక కథనము ఇలా గలదు.

తాయిఫ్ ప్రజలు "రబ్బా" అని పిలిచుకునే తమ విగ్రహమైన లాత్‌ను గురించి, ఆ విగ్రహాన్ని మూడు సంవత్సరాల వరకు ధ్వంసం చేయవద్దని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను కోరారు. అయితే, దైవఏకత్వం పట్ల ఉన్న గౌరవంవలన అలాంటి ఒప్పందాన్ని అంగీకరించడానికి ప్రవక్త (స) అనుమతించలేదు. ఆ తరువాత తాయిఫ్ ప్రజలు కనీసం ఒక సంవత్సరం వరకైన దానిని అలాగే ఉంచాలని మళ్లీ కోరారు. కానీ దైవ ప్రవక్త (స) వారి ఈ అభ్యర్థనను కూడా తిరస్కరించారు. చివరికి, కనీసం ఒక నెల వరకైన దానిని ధ్వంసం చేయకుండా ఉండాలని, అప్పటి వరకు ప్రజలు ఇస్లాంను స్వీకరించడానికి అవకాశం ఉంటుందని, అలాగే అమాయక పురుషులు, స్త్రీలు విగ్రహాన్ని ధ్వంసం చేసిన కారణంగా ఇస్లాంను విడిచిపెట్టకుండా ఉంటారని విజ్ఞప్తి చేశారు. అయితే, దైవ ప్రవక్త (స) ఈ సడలింపును కూడా ఇవ్వలేదు. బదులుగా, హజ్రత్ అబూ సుఫ్యాన్ మరియు హజ్రత్ ముఘీరా బిన్ షుఅబ రజి గార్లను పంపి ఆ విగ్రహాన్ని ధ్వంసం చేయించారు.

ముఖ్యంగా ఇస్లామీయ రాజ్యం స్థాపించబడిన తర్వాత, తౌహీద్ పట్ల ప్రవక్త (స)కున్న గౌరవం అలాంటి విగ్రహాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండటానికి అనుమతించలేదు. **(సీరతుల్ హలబియ్య, సంపుటి 3, పేజి 304-305, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)**

అబుల్ హయ్యాజ్ అసదీ ఇలా వివరించారు: హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్ నాతో ఇలా అన్నారు: దైవ ప్రవక్త (స) నన్ను ఏ కార్యం కోసం పంపారో, అదే కార్యం కోసం నిన్ను కూడా పంపకూడదా?. వారు నన్ను 'ఏ విగ్రహాన్ని వదిలిపెట్టకుండా ధ్వంసం చేయాలి, అలాగే ఎత్తుగా నిర్మించిన ఏ సమాధినైనా సమతలంగా చేయాలి' అని ఆదేశించారు."

**(సహి ముస్లిం, సంపుటి 4, పేజి 133, కితాబుల్ జనాయిజ్, బాబుల్ అమర్ బితసవ్వియతుల్ ఖబర్ హదీస్ 1597. నూర్ ఫౌండేషన్ రబ్వా)**

ఇలా ఎందుకు చేశారు?. ఎందుకంటే ఇలాంటి ఆచారాలు తౌహీద్‌కు విరుద్ధమైనవి. ఇస్లామీయ రాజ్యంలో ఇలాంటి ఆచారాలను ఏమాత్రం సహించలేరు. అయితే, విచారకరమైన విషయం ఏమిటంటే, నేటి కాలంలో అనేకమంది ముస్లింలు సమాధులను అతిగా గౌరవించి, వాటి ముందు మోకరల్లిడం ప్రారంభించారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను ప్రార్థించాల్సిన చోట, వారు ఆ సమాధుల్లో సమాధి చేయబడిన వ్యక్తుల నుండే సహాయం కోరుతున్నారు. ఈ విషయంలో వారు అతిశయానికి చేరుకున్నారు.

దైవ ఏకత్వాన్ని స్థాపించడానికి దైవ ప్రవక్త (స) మక్కా విగ్రహారాధకుల వంటి శక్తివంతమైన జాతిని ఎదుర్కొని, చివరికి కాబాను 360 విగ్రహాల నుండి శుద్ధి చేశారు. అయితే, అంతటితో ఆగకుండా, ఇస్లాంను స్వీకరించిన వారి హృదయాలలో కూడా తౌహీద్‌ను స్థాపించడానికి ప్రవక్త (స) ఒక మహోన్నతమైన, ఆశీర్వాద పూర్వకమైన పోరాటం (జిహాద్) సాగించారు. తమ ఆధ్యాత్మిక శక్తితో తౌహీద్‌ను మనస్ఫూర్తిగా ప్రేమించే ఒక సమాజాన్ని నిర్మించారు.

ప్రవక్త (స) తన సహచరులకు (సహాబాలకు) అంత లోతుగా, అత్యుత్తమ నైతిక శిక్షణ ఇచ్చారు కాబట్టి, వారి మనస్సుల్లో అన్యారాధదన అనే భావనకు స్వల్పమైన ఆనవాలు కూడా మిగలలేదు. ఈ క్రమంలోనే, తమను ప్రశంసించడంలో కూడా అతిశయోక్తికి పోకూడదని ప్రవక్త (స) తన సహచరులను హెచ్చరించారు.

హజ్రత్ ఇబ్నే అబ్బాస్ (రజి) ఇలా ఉల్లేఖించారు: వారు హజ్రత్ ఉమర్ (రజి)ను మింబర్‌పై ఇలా చెప్పడం విన్నారు: హజ్రత్ ఉమర్ రజి ఇలా తెలిపారు. "నేను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెల్పుచుండా విన్నాను: 'క్రైస్తవులు మర్యం కుమారుడిని (ఈసా అలైహిస్సలాం) అతిగా ప్రశంసించినట్లుగా మీరు నన్ను అతిగా ప్రశంసించవద్దు. నేను కేవలం అల్లాహ్ దాసుడిని మాత్రమే. కాబట్టి, "అల్లాహ్ దాసుడు మరియు ఆయన ప్రవక్త" అని మాత్రమే చెప్పండి.'"

**(సహీ-బుఖారీ, కితాబ్ అహాదీసిల్ అంబియా, హదీస్ 3445)**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) ఒక ఒక బృందంతో ప్రయాణిస్తూ ఉండగా అల్లాహ్ ప్రవక్త (స) వారిని కలిశారు. ఆ సమయంలో వారు తన తండ్రి పేరుపై ప్రమాణం చేస్తున్నారు. అప్పుడు దైవ ప్రవక్త (స.అ.) ఇలా అన్నారు:

"వినండి! మీ పూర్వీకుల పేర్లపై ప్రమాణం చేయడాన్ని అల్లాహ్ మీపై నిషేధించాడు. ఎవరికైనా ప్రమాణం చేయాలనిపిస్తే, అల్లాహ్ పేరుపై మాత్రమే ప్రమాణం చేయాలి, లేకపోతే మౌనంగా ఉండాలి."

**(సహీ బుఖారీ, కితాబ్ అల్ ఈమాన్ వన్నుజూర్, హదీస్ 6646)**

అల్లాహ్ ఏకత్వానికి (తౌహీద్‌కు) సంబంధించిన విషయంలో దైవ ప్రవక్త (స) అతి స్వల్పమైన భాగస్వామ్యాన్నైనా సహించేవారు కాదు.

కలిమా-ఎ-తౌహీద్‌ను (లా ఇలాహ ఇల్లల్లాహ్) పఠించిన వ్యక్తి యొక్క స్థానం గురించి ఒక హదీస్‌లో ఇలా పేర్కొనబడింది:

ఉబైదుల్లాహ్ బిన్ అద్ది బిన్ ఖియార్ ఇలా తెలిపారు: బను జుహ్రా తెగకు మిత్రుడైన, అలాగే అల్లాహ్ ప్రవక్త (స)తో కలిసి బదర్ యుద్ధంలో పాల్గొన్న హజ్రత్ మిక్దాద్ బిన్ అమర్ వకింది (రజి) ఇలా చెప్పారు: "ఒకసారి నేను దైవ ప్రవక్త (స)ను ఇలా అడిగాను: 'ఓ అల్లాహ్ ప్రవక్తా! నేను యుద్ధంలో ఒక అవిశ్వాసిని ఎదుర్కొని పోరాడుతున్నప్పుడు, అతడు తన ఖడ్గంతో నా ఒక చేతిని నరికివేసి, తర్వాత ఒక చెట్టు వెనుక దాక్కొని, "నేను అల్లాహ్ కొరకు ముస్లిం నయ్యాను" అని చెప్పినట్లయితే, అతడు ఈ మాటలు చెప్పిన తరువాత కూడా నేను అతనిని చంపాలా?' అందుకు అల్లాహ్ ప్రవక్త (స) ఇలా జవాబిచ్చారు:"అతనిని చంపవద్దు." అప్పుడు హజ్రత్ మిక్దాద్ (రజి) మళ్లీ ఇలా అడిగారు: "ఓ అల్లాహ్ ప్రవక్తా! అతడు నా ఒక చేతిని నరికి వేసిన తర్వాతే 'లా ఇలాహా ఇల్లల్లాహు' అని పలికినా కూడనా?." అందుకు అల్లాహ్ ప్రవక్త (స) మళ్లీ ఇలా అన్నారు: "అతనిని చంపవద్దు. ఎందుకంటే, నీవు అతనిని చంపితే, నీవు అతనిని చంపక ముందు ఉన్న స్థితిని అతడు పొందుతాడు; మరియు అతడు ఇప్పుడు పలికిన ఈ మాటలు పలకక ముందు ఉన్న స్థితిని నీవు పొందుతావు."

**(సహీబుఖారీ, కితాబ్ అల్-మఘాజీ, హదీస్ 4019)**

కాబట్టి, ప్రారంభ కాలంలోని కొంతమంది సహాబాలు ఇలాంటి చర్యకు పాల్పడినప్పుడు, దైవ ప్రవక్త (స.అ.) అట్టి చర్య పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. కానీ నేటి కాలంలోని కొందరు తమను తాము పండితులుగా చెప్పుకునే వారి పరిస్థితిని పరిశీలిస్తే, అది పూర్తిగా భిన్నంగా కనిపిస్తుంది.

పాకిస్తాన్‌లో, అహ్మదీయులు కలిమాను పఠిస్తున్నప్పటికీ, వారిపై జరుగుతున్న హింసకు హద్దులు లేవు. ఇలాంటి అణచి వేతదారుల గురించి దైవ ప్రవక్త (స) ఈ హదీస్‌లోనే ముందుగానే తమ తీర్పును వెల్లడించారు. ఏదేమైనా, ఇలాంటి అతివాద మతబోధకులను అనుసరించే ప్రజలు ఈ విషయంపై గంభీరంగా ఆలోచించాలి.

ఈ సందర్భంలో మరొక హదీస్‌లో హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజి) ఇలా తెలిపారు: అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మమ్మల్ని ఒక

దండయాత్రకు పంపించారు. ఉదయం మేము జుహైనా తెగకు చెందిన హురఖాత్ అనే గ్రామానికి చేరుకున్నాము. అక్కడ నేను ఒక వ్యక్తిని వెంబడించి పట్టుకున్నాను. అప్పుడు అతను “లా ఇలాహ ఇల్లల్లాహ్” అని పలికాడు. అయినప్పటికీ నేను నా ఈటెతో అతనిని పొడిచి చంపాను. తరువాత అతను “లా ఇలాహ ఇల్లల్లాహ్” అని పలికినప్పటికి నేను అతనిని చంపినందుకు నా మనస్సు ఎంతో కలత చెందింది. నేను ఈ విషయాన్ని అల్లాహ్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్ద ప్రస్తావించాను. అప్పుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అడిగారు: “అతను ‘లా ఇలాహ ఇల్లల్లాహ్’ అని పలికిన తర్వాత కూడా నీవు అతనిని చంపావా?”. అందుకు నేను సమాధానంగా “ఓ అల్లాహ్ ప్రవక్తా! అతను ఆయుధానికి భయపడి మాత్రమే అలా పలికాడు ” అని అన్నాను. అప్పుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: “అతను నిజాయితీతో చెప్పాడో లేదో తెలుసుకోవడానికి అతని హృదయాన్ని చీల్చి చూశావా?” ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ మాటను పదేపదే నాతో చెబుతూనే ఉన్నారు. చివరికి నేను, “నేను ఇస్లాంను ఈ రోజే స్వీకరించి ఉండి ఉన్నచో ఎంత బాగుండేది!” అని అనుకునేంతగా పశ్చాత్తాపానికి గురయ్యాను.

**(సహీ ముస్లిం, కితాబుల్ ఈమాన్, హదీస్ 132)**

మరొక హదీస్‌లో హజ్రత్ జాబిర్ (రజియల్లాహు అన్హు) ఇలా వివరించారు: ఒక వ్యక్తి అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి అడిగాడు: “ఓ అల్లాహ్ ప్రవక్తా! స్వర్గం మరియు నరకం తప్పనిసరిగా లభించడానికి కారణమయ్యే రెండు విషయాలు ఏమిటి?” ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా జవాబిచ్చారు: “ అల్లాహ్‌కు ఎవరినీ భాగస్వామిగా చేర్చకుండా మరణించిన వారు స్వర్గంలో ప్రవేశిస్తారు. అల్లాహ్‌తో పాటు ఇతరులను భాగస్వాములుగా చేసి మరణించిన వారు నరకాగ్నిలో ప్రవేశిస్తారు.”

**(సహీహ్ ముస్లిం, కితాబుల్ ఈమాన్, హదీస్ 127)**

మహ్మూద్ బిన్ లబీద్ రజియల్లాహు అన్హు ఇలా తెలిపారు: అల్లాహ్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: “మీ గురించి నేను అధికముగా భయపడుతున్నది సూక్ష్మ అన్యారాధనను గూర్చి (దాగి ఉన్న భాగస్వామ్యం).” సహాబాలు ఇలా అడిగారు: “ఓ అల్లాహ్ ప్రవక్తా! సూక్ష్మ అన్యారాధన అంటే ఏమిటి?” ప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు: “అది ప్రదర్శన, ఇతరులు మెచ్చుకోవాలని చేసే ఆడంబరం.” తీర్పు దినాన, ప్రజలకు వారి కర్మలకు ప్రతిఫలం ఇవ్వబడుతున్నప్పుడు, అల్లాహ్ తఆలా అలాంటి వారితో ఇలా అంటాడు: “ప్రపంచంలో మీరు ఎవరి కోసం మీ పనులను ప్రదర్శించారో వారి దగ్గరకు వెళ్లండి. వారివద్ద నుండి మీకు ఏదైనా ప్రతిఫలం దొరుకుతుందో చూడండి.” అప్పుడు వారు క్షమాపణ కోరాలనుకుంటే, వారు ప్రదర్శన చేసిన వారినే ఆశ్రయించాలి. వారివద్ద నుండి మీకు లభిస్తుందో అప్పుడు తెలుస్తుంది.

**(ముస్నద్ ఇమాం అహ్మద్ బిన్ హంబల్, హదీస్ 24030)**

అందువల్ల, మన మంచి పనులను ఇతరులకు చూపించడం కోసం లేదా ప్రాపంచిక సంబంధమైన ప్రయోజనాల కోసం, వారిని ప్రసన్నం చేయడం కోసం చేసినట్లయితే, అది అల్లాహ్‌కు ఇతరులను భాగస్వాములుగా చేయడంతో సమానమవుతుంది. ఇదే అన్యారాధన, మరియు ఇది అల్లాహ్ తఆలాకు అత్యంత అసహ్యమైన పాపం.

హజ్రత్ అబ్దుల్లాహ్ (రజియల్లాహు అన్హు) ఇలా వివరించారు: ఈ సూక్తి اَلَّذِیۡنَ اٰمَنُوۡا وَلَمۡ یَلۡبِسُوۡۤا اِیۡمَانَھُمۡ بِظُلۡمٍ అనగా “విశ్వసించిన ప్రజలు, తమ విశ్వాసాన్ని అన్యాయంతో కలుషితం చేయకుండ ఉన్నవారు...” అవతరించినప్పుడు, సహాబాలు “మాలో అన్యాయం చేయకుండ ఎవరు ఉన్నారు?” మాలో చాలా మంది ఉన్నారు. ఎందుకంటే ప్రతి మనిషి ఏదో ఒక సమయంలో అన్యాయం చేసి ఉంటాడు, కొన్నిసార్లు తాను చేసిన అన్యాయం తనకే తెలియకపోవచ్చు కదా అని అడిగారు. అప్పుడు అల్లాహ్ తఆలా اِنَّ الشِّرۡکَ لَظُلۡمٌ عَظِیۡمٌ అనే సూక్తిని అవతరింపజేశాడు. అనగా “నిశ్చయంగా, అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం మహా అన్యాయం.”

**(సహీ బుఖారీ, కితాబుల్ ఈమాన్, బాబ్ జుల్మ్ దూన జుల్మ్ హదీస్ 32)**

అందువల్ల అల్లాహ్ తఆలా స్పష్టంగా తెలియజేశాడు. అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం అత్యంత ఘోరమైన అన్యాయం. కాబట్టి అల్లాహ్ తప్ప మరేదానిపైనైనా ఆధారపడడం లేదా దానిని ఆయన స్థాయిలో ఉంచడం వంటి చర్యలు అన్యారాధనకు దారితీస్తాయి. కాబట్టి మనలో ఏ విధమైన సూక్ష్మ అన్యారాధన భావమున్నదో అని ప్రతి ఒక్కరూ లోతుగా ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఎందుకంటే అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం అత్యంత ఘోరమైన అన్యాయం.

మనము ప్రచురించిన సహీ బుఖారీ గ్రంథంలో హజ్రత్ వలీయుల్లాహ్ షా సాహిబ్ గారి వ్యాఖ్యానం ఇలా వ్రాయబడింది: اِنَّ الشِّرۡکَ لَظُلۡمٌ عَظِیۡمٌ అనగా “నిశ్చయంగా అన్యారాధన ఒక మహా అన్యాయం.” అన్యాయం అనే పదానికి అర్థం: وَضۡعُ الشَّیۡءِ فِیۡ غَیۡرِ مَوۡضِعِہٖ అనగా “ఏదైనా వస్తువును దానికి తగిన స్థానంలో కాకుండా వేరే చోట ఉంచడం.” అన్ని రకాల దుర్గుణాలు, నిషిద్ధమైన కార్యాలు “మహా అన్యాయం” అనే అర్థంలోకే వస్తాయి. “ **కుఫ్రున్ దూన కుఫ్రున్** ” అనే శీర్షిక క్రింద, అన్యారాధనను అతి పెద్ద అవిశ్వాసంగా పేర్కొనడమే కాకుండా, చిన్న చిన్న దుర్గుణాలను కూడా అవిశ్వాసం యొక్క ఒక రూపంగా పేర్కొనడం జరిగింది. ఇదే దీనిలోని సూక్ష్మమైన భావం. ఆ తర్వాత “**జుల్మున్ దూన జుల్మున్**” అనే శీర్షిక క్రింద, అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం అత్యంత పెద్ద అన్యాయమని వివరించబడింది. ఎందుకంటే, అల్లాహ్‌కు మాత్రమే చెందిన దైవిక లక్షణాలను ఇతరులకు ఆపాదించడం ఇందులో ఉంది. ఉదాహరణకు, ఆరాధనలో ఇతరులను అల్లాహ్‌తో సమానులుగా నిలబెట్టడం. ఆరాధన అంటే ప్రేమ, విధేయత అనే అర్థాలను కూడా కలిగి ఉంటుంది. ఇవి సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కే ప్రత్యేకమైన హక్కులు. కాని వీటిలోనే ఇతరులకు భాగస్వాములను చేర్చడం జరుగుతుంది. మనిషి అల్లాహ్ సేవకుడిగా, ఆయన చిత్తాన్ని నెరవేర్చడానికి సృష్టించబడ్డాడు. అయితే, అన్యారాధన వల్ల అతడు తన స్వీయ కోరికలకు, లేదా తనలాంటి మరొక మనిషికి, లేదా అల్పమైన సృష్టులకు బానిసగా మారి, తనకు ఇవ్వబడిన ఉన్నత స్థానానికి ఎంతో దిగువకు పడిపోతాడు. మానవుల హక్కుల విషయంలో, మరొకరికి అన్యాయంగా హక్కు లేదా అధికారం ఇవ్వడం అన్యాయం. అయితే, అల్లాహ్ హక్కుల విషయంలో, ఆయనకు మాత్రమే చెందవలసిన హక్కులను ఇతరులకు ఇవ్వడం ఇంకా గొప్ప అన్యాయం. మనుషుల హక్కులను ఉల్లంఘించడం అన్యాయమే, అలాగే అల్లాహ్ హక్కులను సక్రమంగా నిర్వర్తించకపోవడం కూడా అన్యాయమే. ఇదే “అన్యాయం” అనే భావన, అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం అనే పాపానికి పూర్తిగా సరిపోతుంది. వాస్తవానికి, అన్యారాధన మనిషి జీవిత పరమార్థాన్నే నాశనం చేస్తుంది. ఖుర్‌ఆన్ సూక్తులు మరియు హదీస్‌ల ఆధారంగా, ఇమామ్ బుఖారీ (రహిమహుల్లాహ్) ఇలా వివరించారు: అన్ని రకాల అన్యారాధ భావన రహితమునే సంపూర్ణ విశ్వాసం అంటారు. ఊలాఇక లహుముల్ అమ్‌ను వహుం ముహ్‌తదూన్ అనగా “వారికే నిజమైన భద్రతఉంది, వారే సన్మార్గాన్ని పొందినవారు.” (అన్‌ఆమ్:83) పరిపూర్ణ విశ్వాసం మరియు మార్గదర్శకత్వంలు తమ విశ్వాసంలో అన్యారాధన మరియు అన్యాయం అనే మలినంలు ఏమాత్రం లేని వారికే చెందుతాయి. ఒకవైపు సత్కార్యాలు, మరోవైపు అన్ని రకాల అన్యాయంల నుండి దూరముండడం, ఈ రెండూ కలిసినప్పుడే విశ్వాసం సంపూర్ణమవుతుంది. ఎందుకంటే అన్యారాధన పాపం, అన్ని రకాల అవిశ్వాస చర్యలు విశ్వాసాన్ని క్రమంగా బలహీన పరుస్తూనే ఉంటాయి.

**(సహీ బుఖారీ, సంపుటి 1, నజారత్ ఇషాఅత్, పుట 79)**

అందువల్ల, అల్లాహ్ ఏకత్వాన్ని స్థాపించడం మరియు ఆయనకు భాగస్వాములను కల్పించకుండా పరిశుద్ధంగా ఉండడం అనే ప్రమాణాన్ని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మనకు బోధించారు.

అబూ హురైరా (రజియల్లాహు అన్హు) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా చెప్పారు: “సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇలా అంటున్నాడు: ‘ఆదం సంతానం నన్ను తిరస్కరించింది. అలా చేయడానికి అతనికి హక్కు లేదు. అలాగే నాపై అవమానకరమైన మాటలు పలికింది. దానికీ అతనికి హక్కు లేదు. అతడు నన్ను తిరస్కరించడం అంటే, నేను అతన్ని మొదటిసారి సృష్టించినట్లే తిరిగి పునరుత్థానం చేయనని చెప్పడమే. అలాగే నాపై అవమానకరమైన మాటలు పలకడం అంటే, “అల్లాహ్‌కు కుమారుడు ఉన్నాడు” అని చెప్పడం. అయితే నేను అందరికీ ఆధారమైనవాడిని, నాకు ఎవరి అవసరమూ లేదు. నేను ఎవరినీ జనించలేదు, నన్నెవరూ జనించలేదు, నా వంటి మరెవ్వరూ లేరు.’ అల్లాహ్‌కు కుమారులు లేరు, అతనికి తండ్రి కూడ లేదు. ఆయన లక్షణాలలో ఆయనతో సమానమైన వారు ఎవరూ లేరు.”

**(సహీహ్‌బుఖారీ, కితాబ్ తఫ్సీరుల్‌ఖుర్‌ఆన్, బాబ్: “అల్లాహు స్సమద్”, హదీస్ 4975)**

సూరహ్ ఇఖ్లాస్‌ను వివరిస్తూ ఒక సందర్భంలో, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు: అల్లాహ్ తాలా ఇలా తెలిపాడు. అల్లాహు స్సమద్, “ అందరూ అల్లాహ్‌పై ఆధారపడే సర్వసంపూర్ణ సత్తా, కానీ ఆయన మాత్రం ఎవరి మీదా ఆధారపడడు.” హుజూర్ (అ) ఇలా తెలిపారు: ఈ సంక్షిప్తమైన, ఒక్క పంక్తి కూడా పూర్తిగా కాని ఈ ప్రకటనలో, సృష్టికర్త యొక్క అస్తిత్వాన్ని ఎలాంటి భాగస్వామ్యానికీ అతీతమైనదిగా ఎంత సుందరంగా, ఎంత అద్భుతంగా వివరించబడిందో గమనించండి. దీనికి వివరణ ఏమిటంటే, తర్కబద్ధమైన దృష్టిలో భాగస్వామ్యం నాలుగు రకాలుగా ఉండవచ్చు. కొన్నిసార్లు అది సంఖ్యా పరంగా ఉంటుంది. మరికొన్నిసార్లు హోదా లేదా స్థాయికి సంబంధించినది. ఇంకొన్ని సందర్భాల్లో వంశపారంపర్యానికి సంబంధించినది. మరికొన్ని సందర్భాల్లో కార్యం మరియు దాని ఫలితానికి సంబంధించినది. ఈ సూరాలో అల్లాహ్ ఈ నాలుగు రకాల భాగస్వామ్యాలన్నింటి నుండి పూర్తిగా విముక్తుడని ప్రకటించబడింది. అల్లాహ్ సంఖ్యాపరంగా ఒక్కడే. ఇద్దరు లేదా ముగ్గురు కారు. ఆయన అస్సమద్ అంటే అవసరమైన అస్తిత్వం కలిగి, అందరికీ అవసరమైనవాడు, తన స్థితిలో అద్వితీయుడు, సాటిలేనివాడు. ఆయన తప్ప మిగిలిన ప్రతిదీ అనిత్యమైనది, ఆధారపడినదే; ఎల్లప్పుడూ ఆయనపైనే ఆధారపడి ఉంటుంది.అలాగే, లమ్ యలిద్ అంటే ఆయనకు కుమారుడు లేడు. కాబట్టి కుమారుడనే కారణంతో ఎవరూ ఆయన భాగస్వామి కాలేరు.వ లమ్ యూలద్ అంటే ఆయన జన్మించలేదు. ఆయనకు తండ్రి లేదు. అందువల్ల తండ్రి అనే కారణంతో కూడా ఎవరూ ఆయన భాగస్వామి కాలేరు. అలాగే, వ లమ్ యకున్ లహూ కుఫువన్ అహద్ అంటే ఆయన కార్యాలలో, శక్తిలో, మహిమలో

ఆయనకు సమానుడెవ్వరూ లేరు. కాబట్టి కార్యసంబంధంగా కూడా ఎవరూ ఆయనతో భాగస్వామ్యం కలిగి ఉండలేరు. ఈ విధంగా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఈ నాలుగు రకాల భాగస్వామ్యాలన్నింటి నుండి సంపూర్ణంగా విముక్తుడని, ఆయన ఒక్కడే, ఆయనకు ఎటువంటి భాగస్వామి లేదని స్పష్టంగా తెలియజేయబడింది.

**(బరాహీన్-ఎ-అహ్మదియ్యా, భాగం 4, రూహాని ఖజాయిన్, సంపుటి 1, పేజి 518, అనుబంధపు, అనుబంధము సంఖ్య 3)**

హజ్రత్ ఆయిషా (రజి) కథనం ప్రకారం, దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక వ్యక్తిని సైనిక దళానికి నాయకునిగా నియమించారు. ఆయన నమాజ్‌లో తన సహచరులకు ఖుర్ఆన్ పారాయణం చేస్తూ, ప్రతి సారి చివరలో "ఖుల్ హువల్లాహు అహద్" (సూరహ్ ఇఖ్లాస్)ను చదివేవారు. వారు తిరిగి వచ్చిన తర్వాత ఈ విషయాన్ని దైవ ప్రవక్త (స)కు తెలియజేశారు. అప్పుడు ప్రవక్త (స.అ) ఇలా అన్నారు: "అతను ఇలా ఎందుకు చేస్తున్నాడో అడగండి." వారు అడిగినప్పుడు ఆ వ్యక్తి ఇలా సమాధానమిచ్చాడు. "ఎందుకంటే ఈ సూరాలో కరుణామయుడైన అల్లాహ్ యొక్క గుణాలు ఉన్నాయి. అందుకే దీన్ని చదవడం నాకు ఎంతో ఇష్టం." అప్పుడు దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "అతనికి తెలియ జేయండి. అల్లాహ్ కూడా అతనిని ప్రేమిస్తున్నాడు." ఎందుకంటే ఈ సూరా అల్లాహ్ యొక్క ఏకత్వాన్ని ప్రకటిస్తుంది. కాబట్టి దానిని ప్రేమించిన వ్యక్తిని అల్లాహ్ కూడా ప్రేమిస్తాడు.

**(సహీ బుఖారీ, హదీస్ 7375)**

అల్లాహ్‌పై ప్రేమ మరియు ఆయన ఏకత్వంపై అచంచల విశ్వాసానికి సంబంధించిన అనేక ఉదాహరణలు సహాబాల జీవితాలలో కనిపిస్తాయి.

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం ప్రకారం, మస్జిద్ కుబాలో అన్సార్‌కు చెందిన ఒక వ్యక్తి ఇమామ్‌గా నమాజ్ చదివించేవాడు. ప్రతి రకాత్‌లో ముందుగా సూరహ్ -ఇఖ్లాస్‌ను పూర్తిగా చదివి, తర్వాత మరో సూరాను చదివేవాడు. ప్రతి రకాత్‌లోనూ ఇదే విధానాన్ని పాటించేవాడు. ముందు కథనం ఒక యుద్ధ సమయానికి చెందినది. కాని ఇది ఒక ప్రాంతానికి చెందిన ఇమాంకు చెందినది. "మీరు ముందుగా ఈ సూరాను చదివి, తరువాత ఇంకో సూరా కూడా చదువుతున్నారు. ఒకవేళ ఈ సూరానే సరిపోతుందని భావిస్తే దీన్నే చదవండి; లేకపోతే దీన్ని వదిలి ఇంకో సూరా చదవండి." దానికి ఆయన ఇలా సమాధాన మిచ్చాడు: "నేను దీన్ని ఎప్పటికీ వదిలిపెట్టను. మీరు ఈ విధంగా నేను నమాజ్ చదివించడాన్ని ఇష్టపడితే చదివిస్తాను. ఇష్టం లేకపోతే నేను ఇమామత్ చేయను." వారు ఆయనను తమలో అత్యుత్తముడిగా భావించేవారు. అందుకే ఆయన స్థానంలో మరెవరూ ఇమామ్ కావాలని కోరుకోలేదు. తర్వాత దైవ ప్రవక్త (స) అక్కడికి వచ్చినప్పుడు ఈ విషయాన్ని వారికి వివరించారు. ప్రవక్త (స) ఆ వ్యక్తిని అడిగారు: "నీ మిత్రులు చెప్పిన విధంగా ఎందుకు చేయడం లేదు? ప్రతి రకాత్‌లో ఈ సూరానే ఎందుకు చదువుతున్నావు?" ఆయన వినయంతో ఇలా సమాధానమిచ్చాడు: "ఓ అల్లాహ్ ప్రవక్తా! నాకు ఈ సూరా ఎంతో ప్రియమైనది." దానికి అల్లాహ్ ప్రవక్త (స) ఇలా అన్నారు: "నీవు ఈ సూరాను ప్రేమించిన కారణంగానే అల్లాహ్ నిన్ను స్వర్గంలో ప్రవేశింపజేశాడు." అంటే, సూరహ్ ఇఖ్లాస్‌పై ఆయనకున్న ప్రేమ స్వర్గప్రాప్తికి కారణమైంది.

**(జామిఅ తిర్మిజీ, హదీస్ 2901)**

దైవ ప్రవక్త (స.అ) యొక్క ఆధ్యాత్మిక శక్తి మరియు శిక్షణ సహాబాలను కూడా అల్లాహ్ ఏకత్వాన్ని ఇతరులకు తెలియజేసే ప్రకాశవంతమైన మార్గదర్శకులుగా తీర్చిదిద్దింది. సహీ బుఖారీలో మరొక హదీస్‌లో, దైవ ప్రవక్త (స) సూరహ్ ఇఖ్లాస్ ఖుర్ఆన్‌లో మూడవ వంతుకు సమానమని ప్రకటించారు.

**(సహీ బుఖారీ, హదీస్ 5013)**

తన వ్యాఖ్యానంలో హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి.) ఇలా వ్రాశారు: "ఈ అధ్యాయం ఖుర్ఆన్‌లో మూడవ వంతు అని చెప్పబడటానికి అర్థం, అది పవిత్ర ఖుర్ఆన్ భౌతిక పరిమాణంలో మూడవ వంతు భాగాన్ని ఆక్రమించిందని కాదు. దాని భావం ఏమిటంటే, ఇందులోని విషయం అత్యంత ప్రాముఖ్యతను కలిగి ఉందని. పవిత్ర ఖుర్ఆన్ మరియు హదీస్‌లను అధ్యయనం చేస్తే, చివరి కాలంలో రెండు మహా విపత్తులు ఉద్భవిస్తాయని స్పష్టమవుతుంది. ఒకటి దజ్జాల్ యొక్క విపత్తు, మరొకటి యాజూజ్ మరియు మాజూజ్ యొక్క విపత్తు. ఈ రెండు విపత్తులు వరుసగా ఇస్లాంను ఎదుర్కోవలసి ఉంది. ఒకటి ఒకే దేవునికి బదులుగా ముగ్గురు దేవుళ్లను విశ్వసించే సిద్ధాంతం. అంటే తండ్రి దేవుడు, కుమారుడు దేవుడు, పరిశుద్ధాత్మ దేవుడు. మరొకటి భౌతికవాదం (మెటీరియలిజం), ఇది దేవుని ఉనికినే పూర్తిగా నిరాకరిస్తుంది. పవిత్ర ఖుర్ఆన్ ఈ రెండు పరీక్షల తప్పుడు సిద్ధాంతాలను ఖండించి, సరైన విశ్వాసాలను వివరించింది. పవిత్ర ఖుర్ఆన్ అంతా తండ్రి దేవుని స్తుతితో నిండి ఉంది. ఆయనే సమస్త సృష్టికి పోషకుడు, ఆయనే ఏకైక దేవుడు అని ప్రకటిస్తుంది. అంటే, అది సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క మహిమను గానం చేస్తూ, ఆయన ఏకత్వాన్ని స్థాపిస్తుంది. అదే సమయంలో, కుమారుడు దేవుడు మరియు పరిశుద్ధాత్మ దేవుడు అనే భావనలను గట్టిగా తిరస్కరిస్తుంది. తనతో పాటు మరే ఇతర దేవుళ్ల లేరని అల్లాహ్ స్పష్టంగా ప్రకటించాడు. ఈ విధంగా, ఖుర్ఆన్ తండ్రి దేవుని నిజమైన దైవత్వాన్ని స్థాపించి, కుమారుడు దేవుడు మరియు పరిశుద్ధాత్మ దేవుడు అనే భావనలను ఖండించింది. అందువల్ల, తండ్రి దేవుని దైవత్వాన్ని స్థాపించడం పవిత్ర ఖుర్ఆన్ విషయ వస్తువులో మూడవ వంతును ఏర్పరుస్తుంది కాబట్టి, సూరహ్ ఇఖ్లాస్ కూడా ఖుర్ఆన్‌లో మూడవ వంతుకు సమానమవుతుంది. వాస్తవానికి, పవిత్ర ఖుర్ఆన్ యొక్క ముఖ్య ఉద్దేశం దేవుని ఏకత్వాన్ని స్థాపించడం మరియు తప్పుడు విశ్వాసాలను నిర్మూలించడం. కాబట్టి, ఈ సూరహ్ అత్యంత సంక్షిప్తమైన మరియు సమగ్రమైన పదాలలో తప్పుడు సిద్ధాంతాలను ఖండించి, వాటి అసత్యాన్ని నిరూపించి, దైవ ఏకత్వం యొక్క వాస్తవాన్ని వివరించినందున, ఇది కేవలం ఖుర్ఆన్‌లో మూడవ వంతు మాత్రమే కాదు; నిజానికి మొత్తం ఖుర్ఆన్‌కు సమానమైనదే. అందువల్ల, దైవ ప్రవక్త (స) ఈ సూరహ్‌ను ఖుర్ఆన్‌లో మూడవ వంతు అని ప్రకటించడం అతిశయోక్తి కాదు. దాని విషయ ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని, వారు దాని లోతైన ప్రాధాన్యాన్ని తెలియ జేయడానికి అలా పేర్కొన్నారు."

**(తఫ్సీర్-ఎ-కబీర్, సంపుటి 15, పుటలు 372--373)**

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు:

"కావున, తౌహీద్ (దేవుని ఏకత్వం) గురించి సంపూర్ణ నిశ్చయాన్ని ఒక ప్రవక్త ద్వారానే పొందవచ్చని ఖచ్చితంగా తెలుసుకోండి. మన దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వేలాది దివ్య సూచనలను చూపి అరేబియాలోని నాస్తికులను మరియు విగ్రహారాధకులను సర్వశక్తిమంతుడైన దేవుని ఉనికి గురించి నమ్మించారు. ఈ రోజుకీ కూడా, దైవ ప్రవక్త (స) యొక్క నిజమైన మరియు పరిపూర్ణ అనుచరులు ఆ దివ్య సూచనలను నాస్తికులకు సమర్పిస్తూనే ఉన్నారు. వాస్తవం ఏమిటంటే, ఒక వ్యక్తి జీవముగల దేవుని సజీవ శక్తులను స్వయంగా అనుభవించనంత వరకు, షైతాను అతని హృదయం నుండి తొలగిపోదు. నిజమైన తౌహీద్ అతని హృదయంలో ప్రవేశించదు. అలాగే దేవుని ఉనికి గురించి అతనికి సంపూర్ణ నిశ్చయం కలగదు. ఈ పవిత్రమైన మరియు పరిపూర్ణమైన తౌహీద్‌ను దైవ ప్రవక్త (స) ద్వారానే పొందవచ్చు."

**(హఖీఖతుల్ వహీ రూహాని ఖజాయిన్ సంపుటి 22 పేజిలు 121)**

ఈ యుగంలో, బాహ్యంగా దేవుని ఏకత్వాన్ని విశ్వసిస్తున్నామని చెప్పుకునే వారు కూడా దాని నిజమైన సారాన్ని విస్మరించారు. యాజూజ్ మరియు మాజూజ్ యొక్క బాహ్య దుష్ప్రభావాలకే కాకుండా, అంతర్గతంగా ముస్లింలు కూడా తౌహీద్ (దేవుని ఏకత్వం) యొక్క నిజమైన అవగాహనను మరచిపోయారు.

అందువల్ల, ఇటువంటి పరిస్థితుల్లో దైవ ప్రవక్త (స) యొక్క అంకితభావంతో కూడిన సేవకుడు హజ్రత్ మసీహ్ మరియు మహ్దీ రూపంలో ప్రత్యక్షమవడం అవసరమైంది. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ చేసిన వాగ్దానం ప్రకారం, వారు (అ) నిజంగానే అవతరించి తౌహీద్‌పై జరిగిన ప్రతి దాడిని ఎదుర్కొన్నారు.

కాబట్టి, మన బైఅత్‌యొక్క నిజమైన పరిపూర్ణత, మనం తౌహీద్‌పై నిజమైన విశ్వాసులుగా మారినప్పుడే సాధ్యమవుతుంది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మార్చి 23న జమాఅత్‌ను స్థాపించారు. ప్రస్తుతం మనం మార్చి నెలలో ఉన్నాము, అలాగే "హజ్రత్ మసీహ్ మౌవూద్ దినోత్సవం" సందర్భంగా వివిధ జల్సాలను నిర్వహిస్తున్నాము. దీని ఉద్దేశం ఏమిటంటే, దైవ ప్రవక్త (స) యొక్క ఆ అంకిత సేవకుడు తౌహీద్ (దేవుని ఏకత్వం) స్థాపన కొరకు అల్లాహ్ చేత పంపబడ్డారని మనకు గుర్తుచేయడం. అందువల్ల, ఈ జమాఅత్‌లో చేరడం ద్వారా మనం తౌహీద్‌పై స్థిరంగా నిలిచి ఉండాలని ప్రతిజ్ఞ చేశాము. ఆ ప్రతిజ్ఞ యొక్క నిజమైన నెరవేర్పు, మనలో, మన కుటుంబాలలో, మరియు మన సమాజంలో తౌహీద్‌ను స్థాపించడానికి నిరంతరం కృషి చేయడంలోనే ఉంది.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సమస్త ముస్లింలకు దేవుడు పంపిన ప్రవక్తను స్వీకరించే సామర్థ్యాన్ని ప్రసాదించుగాక! తద్వారా వారు తౌహీద్ (దేవుని ఏకత్వం)ను స్థాపించి, ఈ రోజుల్లో అత్యంత తీవ్రతతో దాడి చేస్తున్న యాజూజ్-మాజూజ్ మరియు దజ్జాల్ యొక్క దుష్ట కుట్రలను తిప్పికొట్టగలుగుగాక!

ఇస్రా (రాత్రి ప్రయాణం) గురించి హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నే మసూద్ (రజి) నుండి ఒక హదీస్ ఉల్లేఖించబడింది. అందులో దైవ ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు:

"ఇస్రా రాత్రి నేను ఇబ్రాహీం (అ)ను కలిశాను. ఆయన నాతో ఇలా అన్నారు: 'ఓ ముహమ్మద్ (స), నా తరఫున మీ ఉమ్మత్‌కు సలామ్ తెలియజేయండి. వారికి స్వర్గభూమి అత్యంత సారవంతమైనది, దాని నీరు మధురమైనది, అది విశాలమైన మైదానం అని తెలియజేయండి. దానిలో నాటబడే మొక్కలు ఇవే: సుబ్‌హానల్లాహ్ (అల్లాహ్ పవిత్రుడు), అల్‌హందులిల్లాహ్ (సర్వ స్తుతులు అల్లాహ్‌కే చెందును), లా ఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడెవ్వరూ లేరు), మరియు అల్లాహు అక్బర్ (అల్లాహ్ మహోన్నతుడు)."

**(జామిత్ తిర్మిజి కితాబుల్ దఅవాత్, బాబ్ 59, హదీస్ 3462)**

కాబట్టి, ఒక విశ్వాసి ఈ స్మరణలను (జిక్ర్) లోతైన అవగాహనతో, తౌహీద్ (దైవ ఏకత్వం) పట్ల సంపూర్ణమైన చైతన్యంతో పఠించాలి. ఎందుకంటే విజయానికి ఇదే మార్గం. మేము అల్లాహ్‌ను ఏకైకుడిగా, అద్వితీయుడిగా విశ్వసిస్తున్నాము.

మరో హదీస్‌లో, హజ్రత్ అనస్ ఇబ్నే మాలిక్ (రజి) ఒక హదీస్ –ఎ–ఖుద్సీని ఉల్లేఖించారు. దైవ ప్రవక్త (స.అ.వ.) ఇలా అన్నారు:

"అల్లాహ్, మహిమాన్వితుడూ, శ్రేష్ఠుడూ అయిన ప్రభువు ఇలా సెలవిచ్చాడు: 'ఓ ఆదమ్ సంతానమా! నీవు నన్ను ప్రార్థిస్తూ, నాపై ఆశ ఉంచినంత కాలం, నీవు చేసిన తప్పులు ఎన్ని ఉన్నా నేను నిన్ను క్షమిస్తాను. వాటిని నేను పట్టించుకోను.' (అంటే, వారి బలహీనతలు, లోపాలు ఉన్నప్పటికీ వారు అల్లాహ్‌ను ప్రార్థించినందున ఆయన వారిని క్షమిస్తాడు.) 'ఓ ఆదమ్ సంతానమా! నీ పాపాలు ఆకాశాన్ని తాకేంతగా ఉన్నా, నీవు నన్ను క్షమించమని వేడుకుంటే, నేను నిన్ను క్షమిస్తాను; దానిని నేను పట్టించుకోను.'(పాపాలు ఎంత ఎక్కువైనా, సర్వశక్తిమంతుడైన దేవుడు తన ఇష్టానుసారం వాటన్నింటినీ క్షమించగలడు.) 'ఓ ఆదమ్ సంతానమా! భూమి నిండా పాపాలతో నా వద్దకు వచ్చినా, నాకు ఎటువంటి భాగస్వాములను కల్పించకుండా (షిర్క్ చేయకుండా) నన్ను కలిస్తే, నేను కూడా అంతే పరిమాణంలో క్షమాపణతో నీ వద్దకు వస్తాను. ఒక వ్యక్తి భూమి పరిమాణంలో పాపాలు చేసినప్పటికీ, అతడు షిర్క్ చేయక, సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు భయభక్తులతో జీవించి, ఆయన ఏకత్వాన్ని ప్రకటించి, దాని ప్రకారం ఆచరించేందుకు కృషి చేస్తే, నేను అతనికి నా క్షమాపణను ప్రసాదిస్తాను."

**(జామిఅ తిర్మిజీ, కితాబుద్–దఅవాత్, హదీస్ 3540)**

అందువల్ల, ఒక వ్యక్తి వినయంతో అల్లాహ్ వైపు తిరిగితే ఆయన అతని పాపాలన్నింటినీ క్షమిస్తాడు. అయితే షరతు ఏమిటంటే, అతడు బహుదైవారాధన చేయకూడదు మరియు దైవ ఏకత్వానికి సంబంధించిన హక్కులను నెరవేర్చాలి. కేవలం మాటలతో విశ్వాసాన్ని ప్రకటించడంతో సరిపోదు. ముందే చెప్పినట్లుగా, ప్రతి కార్యం ద్వారా సర్వశక్తిమంతుడైన దేవుడు ఒక్కడే అని నిరూపించాలి.

తౌహీద్ యొక్క మహోన్నత స్థానం గురించి, అబూ సఈద్ ఖుద్రీ (రజి) నుండి ఒక హదీస్ ఉల్లేఖించబడింది. అందులో దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు:

"ప్రవక్త మూసా (అ) ఇలా ప్రార్థించారు: 'ఓ నా ప్రభూ! నిన్ను స్మరించడానికి, నిన్ను ప్రార్థించడానికి నాకు ఒక ప్రత్యేకమైన పదాన్ని నేర్పించు.' అల్లాహ్ ఇలా అన్నాడు: 'ఓ మూసా! లా ఇలాహ ఇల్లల్లాహ్ అని చెప్పు.' మూసా (అ.స.) ఇలా అన్నారు: 'నా ప్రభూ! నీ సేవకులందరూ ఇదే చెబుతున్నారు.'(అంటే, వారందరూ అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడెవ్వరూ లేరని ప్రకటిస్తున్నారు.) అల్లాహ్ మళ్లీ ఇలా అన్నాడు: 'ఓ మూసా! లా ఇలాహ ఇల్లల్లాహ్ అని చెప్పు.'మూసా (అ.స.) ఇలా అన్నారు: 'నా ప్రభూ! నీవు తప్ప ఆరాధనకు అర్హుడెవ్వరూ లేరు. కానీ నాకు ప్రత్యేకంగా ఏదైనా ప్రసాదించు.' అప్పుడు అల్లాహ్ ఇలా అన్నాడు: 'ఓ మూసా! ఏడు ఆకాశాలు, వాటిలో ఉన్న సమస్త సృష్టి, అలాగే ఏడు భూములను ఒక త్రాసులో ఉంచి, మరో త్రాసులో లా ఇలాహ ఇల్లల్లాహ్‌ను ఉంచితే, లా ఇలాహ ఇల్లల్లాహ్ వాటన్నింటికంటే భారంగా ఉంటుంది."

**(అల్–ముస్తద్రక్ అలా అస్సహీహైన్, సంపుటి 1, దారుల్ కుతుబుల్ ఇల్మియ్యా, పుట 710, కితాబుద్–దుఆ, హదీస్ 1936)**

అంటే, ఆకాశాలు మరియు భూమిలోని సమస్త సృష్టి, వాటి సమస్త శ్రేష్ఠతతో కూడి ఒక వైపు ఉంచబడినా, లా ఇలాహ ఇల్లల్లాహ్ (దైవ ఏకత్వ ప్రకటన) వాటన్నింటికంటే అధికమైన విలువను కలిగి ఉంటుంది.

"అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడెవ్వరూ లేరు" అనే ఇస్లామీయ విశ్వాసంపై వచ్చిన ఒక అభ్యంతరానికి సమాధానం ఇస్తూ, దాని అసలైన భావాన్ని వివరిస్తూ, హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) ఇలా పేర్కొన్నారు:

మీరు పేర్కొన్నట్లుగా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) "లా ఇలాహ ఇల్లల్లాహ్" (అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడైన మరెవరూ లేరు) అనే కలిమాను పఠించడం అన్ని పాపాలను తొలగిస్తుందని బోధించారనే విషయం పూర్తిగా సత్యమే. నిజానికి, అల్లాహ్ ఒక్కడే, ఆయనకు ఎటువంటి భాగస్వామి లేడని, అలాగే ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం అదే సర్వశక్తిమంతుడైన, అద్వితీయుడైన అల్లాహ్ పంపిన ప్రవక్త అని విశ్వసించే వ్యక్తి, ఆ విశ్వాసంతోనే మరణిస్తే, అతడు తప్పకుండా మోక్షాన్ని పొందుతాడు. ఆకాశం క్రింద మరొకరి ఆత్మత్యాగం లేదా మరణం ద్వారా ఎవరికీ రక్షణ లభించదు. అసలు అలాంటి భావనను ఊహించడం కూడా అవివేకమే. అయితే, అల్లాహ్ ఒక్కడే, ఆయనకు భాగస్వామి లేడని, ఆయన తన అపారమైన కరుణతో ప్రపంచాన్ని దారి తప్పుదల నుండి రక్షించడానికి తన ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను పంపాడని విశ్వసించడం ఆత్మలోని అజ్ఞానాంధకారాన్ని తొలగిస్తుంది. అహంకారం నశించి, దాని స్థానంలో తౌహీద్ (దైవ ఏకత్వం) స్థిరపడుతుంది. చివరికి తౌహీద్ పట్ల ఉన్న ప్రేమ హృదయాన్ని పూర్తిగా ఆవరించి, స్వర్గజీవితం ఈ లోకంలోనే ప్రారంభమవుతుంది. వెలుగు వచ్చినప్పుడు చీకటి నిలవలేనట్లే, "లా ఇలాహ ఇల్లల్లాహ్" అనే కలిమా యొక్క ప్రకాశం హృదయంలో ప్రవేశించినప్పుడు, అహంకారంతో కూడిన చెడు కోరికలు నశించిపోతాయి. పాపం యొక్క అసలు స్వరూపం ఏమిటంటే, మనిషి అహంకారం మరియు తిరుగుబాటు స్వభావంతో కూడిన కోరికలకు బానిస కావడం. అటువంటి కోరికలకు లోబడిన వారినే పాపులు అంటారు. అరబీ భాషా నిఘంటువుల ప్రకారం "లా ఇలాహ ఇల్లల్లాహ్" యొక్క భావం ఇలా ఉంది: **లా మత్‌లూబ లీ వలా మహ్‌బూబలీ వలా మఅబూద లీ వలా ముతాఅ లీ ఇల్లా అల్లాహు.** అనగా: "అల్లాహ్ తప్ప నేను కోరదగినవాడు లేడు; ప్రేమించదగిన వాడు లేడు; ఆరాధించదగిన వాడు లేడు; విధేయత చూపదగిన వాడు లేడు."

ఈ భావం పాప స్వభావానికి పూర్తిగా విరుద్ధమైనది. కాబట్టి, ఈ భావాలను హృదయ పూర్వకంగా స్వీకరించిన వ్యక్తి మనసులో వాటికి విరుద్ధమైన భావాలు నిలవవు. ఎందుకంటే ఒకే చోట రెండు విరుద్ధమైన విషయాలు కలిసి ఉండలేవు. అహంకారపూరిత కోరికలు తొలగిపోయినప్పుడు, అదే నిజమైన దైవభీతి మరియు యథార్థ నీతి అవుతుంది.

ఈ విశ్వాస ప్రకటనలోని రెండవ భాగం అంటే అల్లాహ్ పంపిన ప్రవక్తను విశ్వసించడం అత్యంత అవసరం. ఎందుకంటే అల్లాహ్‌కు విధేయుడిగా ఉండాలనుకునే వ్యక్తి, ఆయన ఆజ్ఞలను కూడా విశ్వసించాలి. అయితే, ఆ ఆజ్ఞలు ఎవరి ద్వారా ప్రపంచానికి వచ్చాయో, ఆ ప్రవక్తను విశ్వసించకుండా అల్లాహ్ ఆజ్ఞలను విశ్వసించడం సాధ్యం కాదు. కాబట్టి దైవ బోధనలను తీసుకువచ్చిన ప్రవక్తను విశ్వసించడం కూడా తప్పనిసరి. ఇదే ఈ కలిమా యొక్క నిజమైన ఉద్దేశ్యం.

**(నూరుల్ ఖుర్‌ఆన్ నంబర్ 2,రూహానీ ఖజాయిన్ సంపుటి 9, పేజీలు 418–420)**

హజ్రత్ అబూ మూసా అష్‌అరీ (రజి) ఇలా చేస్తారు:

ఒక రోజు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మాతో మాట్లాడుతూ ఇలా అన్నారు: "షిర్క్ (అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం) పట్ల జాగ్రత్తగా ఉండండి. అది చీమ అడుగుజాడ కంటే కూడా సూక్ష్మమైనది." అప్పుడు ఒక సహాబీ అడిగాడు: "ఓ అల్లాహ్ ప్రవక్తా! అది చీమ అడుగుజాడ కంటే సూక్ష్మమైనదైతే, దాని నుండి మేము ఎలా రక్షించుకోవాలి?" అప్పుడు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ దుఆను చదవమని బోధించారు:

اَللّٰهُمَّ اِنَّا نَعُوْذُبِكَ مِنْ اَنْ نُشْرِكَ بِكَ شَيْئًا نَعْلَمُهُ وَنَسْتَغْفِرُكَ لِمَا لَا نَعْلَمُ ـ

అనగా: "ఓ అల్లాహ్! మేము తెలిసి నీకు ఏదైనా భాగస్వామిని కల్పించకుండా ఉండేందుకు నీ శరణు కోరుతున్నాము. అలాగే తెలియక చేసిన తప్పులకు నీ క్షమాపణను వేడుకుంటున్నాము."

ఎల్లప్పుడూ అల్లాహ్ సహాయాన్ని కోరుతూ ఉండండి.

**(ముస్నద్ ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్, సంపుటి 6,పుటలు 614––615, ముస్నద్ అబూ మూసా అల్–అష్‌అరీ, హదీస్ సంఖ్య 19835, ఆలముల్–కుతుబ్, బీరూట్, 1998)**

హజ్రత్ అబ్దుర్ రహ్మాన్ బిన్ అబ్జా (రజి) ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఉదయం నిద్రలేచినప్పుడు ఈ ప్రార్థనను పఠించేవారు:

اَصْبَحْنَا عَلٰى فِطْرَةِ الْاِسْلَامِ وَعَلٰى كَلِمَةِ الْاِخْلَاصِ وَعَلٰى دِيْنِ نَبِيِّنَا مُحَمَّدٍ صلى الله عليه وسلم وَعَلٰى مِلَّةِ اَبِيْنَا اِبْرَاهِيْمَ حَنِيْفًا مُسْلِمًا وَمَا كَانَ مِنَ الْمُشْرِكِيْنَ ـ

అనగా: "మేము ఈ ఉదయాన్ని ఇస్లాం సహజ స్వభావంపై, తౌహీద్ పట్ల సంపూర్ణ చిత్తశుద్ధి అనే వాక్యంపై, మా ప్రవక్త ముహమ్మద్ (స) ధర్మంపై, అలాగే మా తండ్రి ఇబ్రాహీం (అ) మార్గంపై ప్రారంభించాము. ఆయన సత్యమార్గంలో స్థిరంగా ఉన్న ముస్లిం. ఆయన బహుదైవారాధకులలో లేరు."

నిద్రలేచిన వెంటనే ప్రతి ముస్లిం అల్లాహ్‌ను స్మరించాలి.

**(మస్నద్ ఇమామ్ అహ్మద్ బిన్ హన్బల్, సంపుటి 5, పుటలు 294––295, ముస్నద్ అబ్దుర్ రహ్మాన్ బిన్ అబ్జా, హదీస్ 15434, ఆలం అల్–కుతుబ్, బీరుట్, 1998)**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మసూద్ (రజి) ఇలా ఉల్లేఖించారు: సాయంత్రం సమయం వచ్చినప్పుడు దైవ ప్రవక్త (స) ఈ ప్రార్థనను పఠించేవారు:

اَمْسَيْنَا وَاَمْسَى الْمُلْكُ لِلّٰهِ وَالْحَمْدُ لِلّٰهِ لَا اِلٰهَ اِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيْكَ لَهُ ـ అనగా

"మేము మరియు సర్వసృష్టి అల్లాహ్ కొరకు ఈ సాయంత్రంలో ప్రవేశించాము. సమస్త స్తుతులు అల్లాహ్‌కే చెందుతాయి. అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడు లేడు. ఆయన ఒక్కడే; ఆయనకు భాగస్వామి ఎవరూ లేరు."

**(సహీముస్లిం, కితాబ్ అజ్జిక్రి వద్దుఆ, హదీస్ 2723)**

అబ్దుల్లాహ్ బిన్ బురైదా అస్లమీ తన తండ్రి ద్వారా ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) ఒక వ్యక్తి ఇలా ప్రార్థించడం విన్నారు:

"ఓ అల్లాహ్! నీవే అల్లాహ్‌వని, నీ తప్ప ఆరాధనకు అర్హుడు మరెవరూ లేరని, నీవే ఏకైకుడవని, స్వయం సమృద్ధుడవని, నీవు ఎవరినీ కనలేదు, నిన్నెవరూ కనలేదు, నీకు సమానుడు ఎవరూ లేరని నేను సాక్ష్యమిస్తున్నాను. ఈ సాక్ష్యాన్ని

**నూరుల్ ఇస్లాం శాఖ:**

**అహ్మదియ్యా ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.**
**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**
**సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలవు).**

ఆధారంగా చేసుకొని నిన్ను వేడుకుంటున్నాను." ఇది విన్న తరువాత ప్రవక్త (స) ఇలా అన్నారు: "నా ప్రాణం ఎవరి చేతిలో ఉందో ఆ అల్లాహ్ ప్రమాణం!, ఈ వ్యక్తి అల్లాహ్ యొక్క అత్యున్నత నామం ద్వారా ప్రార్థించాడు. ఆ నామంతో ప్రార్థించిన వారికి అల్లాహ్ సమాధానం ఇస్తాడు. ఆ నామంతో అడిగిన వారికి ఆయన ప్రసాదిస్తాడు."

**(జామిఅ తిర్మిజీ, కితాబ్ అద్దఅవాత్, హదీస్ 3475)**

హజ్రత్ అస్మా బింత్ ఉమైస్ (రజి) ఇలా ఉల్లేఖించారు: అల్లాహ్ ప్రవక్త (స) ఆమెతో ఇలా అన్నారు: "కష్టాలు, ఆపదలు వచ్చినప్పుడు నీవు పఠించవలసిన పదాలను నేను నీకు నేర్పించనా?" అవి ఇవి:

**అల్లాహు అల్లాహు రబ్బి లా ఉష్రికూ బిహి షైయిఅన్.**

అనగా: "అల్లాహ్, అల్లాహ్ నా ప్రభువు. నేను ఆయనకు ఎవరినీ భాగస్వామిగా చేయను."

(సునన్ అబీ దావూద్, కితాబ్ అల్-విత్ర్, హదీస్ 1525)

ప్రజలు కష్టసమయాల్లో ఏ ప్రార్థన చేయాలని అడిగినప్పుడు సూచించబడే ముఖ్యమైన ప్రార్థనలలో ఇది ఒకటి.

మరొక హదీసులో హజ్రత్ ఇబ్ను అబ్బాస్ (రజి) ఇలా ఉల్లేఖించారు: ఆపద సమయంలో దైవ ప్రవక్త (స.అ.వ.) ఈ విధంగా ప్రార్థించేవారు:

لَا إِلٰهَ إِلَّا اللّٰهُ الْعَظِيْمُ الْحَلِيْمُ، لَا إِلٰهَ إِلَّا اللّٰهُ رَبُّ السَّمٰوَاتِ وَالْأَرْضِ، وَرَبُّ الْعَرْشِ الْعَظِيْمِ -

అనగా, "అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడు లేడు. ఆయన మహోన్నతుడు, అత్యంత సహన శీలుడు. అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడు లేడు. ఆయనే ఆకాశములకూ భూమికీ ప్రభువు; మహా సింహాసనానికి కూడా ప్రభువు."

**(సహీ బుఖారీ, కితాబ్ అద్దఅవాత్, హదీస్ 6345)**

దైవ ప్రవక్త (స) ఏకదైవారాధన (తౌహీద్) భావాన్ని ఎంత సున్నితంగా బోధించేవారో గమనించండి.

ఒక హదీసులో అబూ రిమ్సా (రజి) ఇలా ఉల్లేఖించారు: ఆయన తండ్రి అల్లాహ్ ప్రవక్త (స)తో ఇలా అన్నారు: "మీ వీపుపై ఉన్న ప్రవక్తత్వ ముద్రను నాకు చూపించండి. నేను వైద్యుడిని." దానికి ప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు: "నిజమైన వైద్యుడు అల్లాహ్ మాత్రమే. నీవు కేవలం ఓదార్పు, ధైర్యం ఇచ్చే వ్యక్తివి. సృష్టించిన వాడూ ఆయనే; స్వస్థతను ప్రసాదించేవాడూ ఆయనే."

**(సునన్ అబీ దావూద్, కితాబ్ తరజ్జుల్, హదీస్ 4207) ( అవ్నుల్‌మఅబూద్, సంపుటి 11, పుట 175, హదీస్ 4201, దారుల్-కుతుబుల్-ఇల్మియ్యా, బీరుట్, 1990)**

హజ్రత్ ఉబాదా బిన్ సామిత్ (రజి) వారి ద్వారా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారని ఉల్లేఖించబడింది:

"ఎవరైతే అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడని, ఆయన ఏకైకుడని, ఆయనకు భాగస్వామి ఎవరూ లేరని, ముహమ్మద్ (స) ఆయన సేవకుడూ, ఆయన ప్రవక్తయని, ఈసా (అలైహిస్సలాం) అల్లాహ్ సేవకుడని, ఆయన దాసి కుమారుడని, మర్యమ్‌కు అల్లాహ్ ప్రసాదించిన ఆయన వాక్యమని, ఆయన తరఫున వచ్చిన ఒక ఆత్మ (రూహ్) అని, అలాగే స్వర్గం సత్యమని, నరకం కూడా సత్యమని సాక్ష్యమిస్తాడో, అతనిని అల్లాహ్ తన చిత్తానుసారం స్వర్గంలోని ఎనిమిది ద్వారాలలో ఏ ద్వారం గుండా అయినా ప్రవేశింపజేస్తాడు."

ఉమైర్ బిన్ హానీ ఇదే హదీస్‌ను అదే పరంపర (ఇస్నాద్) ద్వారా ఉల్లేఖించి ధృవీకరించారు. అయితే ఆయన ప్రకారం దైవ ప్రవక్త (స) ఇలా కూడా అన్నారు: "అతని కార్యాలు ఎలా ఉన్నా, అల్లాహ్ అతనిని స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు." అయితే ఈ రెండవ ఉల్లేఖనంలో స్వర్గంలోని ఎనిమిది ద్వారాల ప్రస్తావన లేదు.

**(సహీ ముస్లిం, కితాబుల్ ఈమాన్, బాబ్ అద్దలీల్ అలా మన్ మాతా అలత్తౌహీది దఖలల్ జన్నహ్, హదీస్ 28)**

హజ్రత్ ఇబ్నే ఉమర్ (రజి) వారి ద్వారా ఉల్లేఖించబడింది. దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "ఇస్లాం ఐదు స్తంభాలపై స్థాపించబడింది: అల్లాహ్ ఒక్కడినే ఆరాధించడం మరియు ఆయన తప్ప ఇతరులందరినీ ఆరాధ్యులుగా తిరస్కరించడం; నమాజ్ ను స్థాపించడం; జకాత్ చెల్లించడం; అల్లాహ్ గృహమైన కాబాను హజ్ చేయడం; మరియు రమజాన్ నెలలో ఉపవాసం పాటించడం."

**(సహీముస్లిం, కితాబుల్ ఈమాన్, బాబ్ బయానీ అర్కానిల్ ఇస్లామ్, హదీస్ 16)**

హిజ్రత్ చేసిన మహిళలలో ఒకరైన హజ్రత్ యాసిరహ్ (రజి) వారి ద్వారా ఉల్లేఖించబడింది. దైవ ప్రవక్త (స) ఇలా ఉపదేశించారు:

"ఓ స్త్రీలారా! మీరు తస్బీహ్ (అల్లాహ్ పవిత్రతను ప్రకటించడం), తహ్లీల్ (అల్లాహ్ ఏకత్వాన్ని ప్రకటించడం), తక్దీస్ (అల్లాహ్ మహిమను కీర్తించడం) చేయడం మీపై విధిగా ఉంది. నిర్లక్ష్యంలో పడకండి; లేకపోతే మీరు అల్లాహ్ ఏకత్వాన్ని మరచిపోతారు. మీ వేళ్లపై లెక్కపెట్టండి. నిశ్చయంగా తీర్పు దినాన ఆ వేళ్లు ప్రశ్నించబడతాయి మరియు అవే మాట్లాడతాయి."

అంటే, అల్లాహ్ స్మరణ, ఆయన పవిత్రత, ఆయన ఏకత్వం, ఆయన మహిమలను జపించేటప్పుడు వేళ్లతో లెక్కపెట్టడం కూడా సున్నత్.

**(అల్-ముస్తద్రక్ అలా అస్సహీహైన్, కితాబుద్ దుఆ, సంపుటి 1, దారుఅల్-కుతుబుల్-ఇల్మియా, పుట 732, హదీస్ 2007)**

ఈ విధంగా దైవ ప్రవక్త (స) సభలోనైనా, సమావేశంలోనైనా, ప్రజల మధ్యనైనా, ఏ సందర్భం వచ్చినా దైవ ఏకత్వం (తౌహీద్) యొక్క సత్యాన్ని, అల్లాహ్ మహిమను తన అనుచరుల హృదయాలలో నాటేందుకు ఏ అవకాశాన్నీ వదిలిపెట్టలేదు.

ఈ సందర్భంలో హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) ఒక ప్రసంగంలో ఇలా పేర్కొన్నారు:

"దైవ ప్రవక్త (స) ఈ విషయములో ఎంతటి ఉత్సాహంతో ఉండేవారంటే, ఆయన ప్రత్యర్థులు కూడా దానిని అంగీకరించక తప్పలేదు. వారు(స) నిల్చున్నా, కూర్చున్నా, నడుస్తున్నా ప్రతి సందర్భంలో అల్లాహ్ నామాన్నే ప్రకటించేవారు.

ఒక ఫ్రెంచ్ చరిత్రకారుడు ఇలా వ్రాశాడు: ముహమ్మద్ (స)పై ఎన్ని ఆరోపణలు చేసినా, ఆయనలో ఒక ప్రత్యేకత మాత్రం ప్రపంచ ఆరంభం నుండి ఇప్పటి వరకు మరెవరిలోనూ తాను చూడలేదు. ప్రవక్తత్వాన్ని ప్రకటించిన క్షణం నుండి ఆయన మరణించే వరకు ఆయన నాలుకపై ఒక్క మాట మాత్రమే ఉండేది- 'అల్లాహ్'. ఆయన జీవితమంతా ఒకే లక్ష్యంతో నిండిపోయినట్లుండేది. ప్రజలలో అల్లాహ్‌పై విశ్వాసాన్ని స్థాపించడం మరియు ప్రపంచానికి అల్లాహ్‌ను పరిచయం చేయడం. అందువల్ల దైవ ప్రవక్త (స) ఈ స్థితిని 'వ్యామోహం' అని వర్ణించిన వారే కూడా, ఆయన జీవితంలోని అత్యున్నత లక్ష్యం అల్లాహ్‌పై విశ్వాసాన్ని, ఆయన ఏకత్వాన్ని స్థాపించడమేనని అంగీకరించారు. దీనిని 'వ్యామోహం' అని పిలవాలనుకుంటే, అది అలాంటి 'వ్యామోహం' తరువాతి తరాలు దాని యజమానిని పరిపూర్ణుడిగా గుర్తించాయి. కనీసం, పగలు, రాత్రి అల్లాహ్ గురించే ప్రకటిస్తూ, ఆయన ఏకత్వాన్ని, గుణాలను స్థాపించడానికి నిరంతరం శ్రమించే వ్యక్తి చెడ్డవాడు కాదని మాత్రం ఒప్పుకున్నాయి."

ఏ సందర్భంలోనైనా, దైవ ప్రవక్త (స) వారి ఈ స్థితిని గమనించడం ద్వారా, వారి ఆగమనం యొక్క ఉద్దేశ్యం నిజానికి సమస్త ప్రవక్తల ఆగమనం యొక్క ఉద్దేశ్యం  షిర్క్‌ను నిర్మూలించడం, అల్లాహ్‌పై విశ్వాసాన్ని స్థాపించడం మరియు ఆయన ఏకత్వ బోధనను ప్రపంచమంతటా వ్యాప్తి చేయడం అని స్పష్టమవుతుంది."


**(ఖుత్బాత్-ఏ-మహ్మూద్, భాగం 9, పుటలు 260-261)**

మరొక సందర్భంలో, హజ్రత్ ముస్లెహ్-ఏ-మౌవూద్ (ర) ఇలా వ్రాసారు:

"దైవ ప్రవక్త (స) వారి స్థానం ఎంత ఉన్నతమైనదైనా, మరియు మన ప్రేమ ఆయన పట్ల ఎంత లోతైనదైనా (ఆయన దీనిని ఒక ఉపన్యాసంలో ప్రస్తావించారు), అల్లాహ్ తఆలా యొక్క స్థానం ఆయనకంటే అనంతంగా ఉన్నతమైనదని మనం గుర్తుంచుకోవాలి. అల్లాహ్ శాశ్వతుడు, నిత్యుడు; కాగా ముహమ్మద్ (స) ఆయన కృపకు సంబంధించిన గొప్ప ప్రత్యక్ష రూపాలలో ఒకరు. దైవ ప్రవక్త (స) వారికి అల్లాహ్ స్థాయిని తగ్గించే విధమైన స్థానాన్ని ఆపాదించడం వాస్తవానికి ఆయన పట్ల శత్రుత్వం చూపినట్లే అవుతుంది. ఎందుకంటే ఆయన స్వయంగా ఎప్పుడూ అల్లాహ్ కంటే ఉన్నతమైన స్థితిని తనకు ఇవ్వడాన్ని ఆమోదించలేదు." గత హదీసుల ద్వారా పేర్కొన్నట్లుగా, వారు (స) తనను అల్లాహ్ కంటే పై స్థాయికి ఎత్తడాన్ని అంగీకరించలేదు. వారి జీవితంలోని ప్రతి అంశం దీనికి సాక్ష్యంగా నిలుస్తుంది. వారు (స) సాధించిన గొప్ప విజయాలు ఏ మానవుడు స్వతంత్రంగా సాధించలేని మహత్తర కార్యాలు; అవి కేవలం అల్లాహ్ శక్తి ద్వారా మాత్రమే సాధ్యమయ్యాయి. అత్యంత బలవంతులైన మనుషులు కూడా అలాంటి కార్యాలు చేయలేరు. అయితే, ప్రవక్త (స) మరణ వేదనలో ఉన్నప్పుడు,  అత్యంత బాధాకరమైన సమయంలో హజ్రత్ ఆయిషా (ర) ఇలా వివరించారు:

"మరణ సమయంలో ఎక్కువగా బాధపడే వ్యక్తి మంచి వ్యక్తి కాదని నేను అనుకునేదాన్ని. (మరణ సమయంలో తీవ్ర వేదనలో ఉన్నవాడు మంచివాడు కాదని

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: *SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)*


Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

ఆమె భావించేది.) కానీ దైవ ప్రవక్త (స) గారి పరిస్థితిని నేను చూసినప్పుడు, నా అభిప్రాయాన్ని మార్చుకోవాల్సి వచ్చింది. అంతటి తీవ్రమైన బాధలో కూడా, వారు (స) అల్లాహ్ తఆలా యొక్క స్థానాన్ని ఎంతో గౌరవిస్తూ, తన అనుచరులు తనపై ఉన్న అపారమైన ప్రేమ వలన తన స్థాయిని అతిశయింపజేస్తారేమోనని భయపడి, పదే పదే ఇలా పలికారు: 'యూదులు మరియు క్రైస్తవులపై అల్లాహ్ శాపం కలుగుగాకా!. ఎందుకంటే వారు తమ ప్రవక్తల సమాధులను ఆరాధనా స్థలాలుగా మార్చుకున్నారు." వారు (స) ఈ మాటలను మళ్లీ మళ్లీ పలుకుతూనే ఉన్నారు. ఈ విధంగా, వారు (స) తన ప్రజలకు ఇచ్చిన చివరి బోధన ఏమిటంటే: "నన్ను షిర్క్‌కు దారి తీసే స్థాయికి పొగడకండి. మీరు అలా చేస్తే నేను సంతోషిస్తానని అనుకోకండి; అలా చేసే వారిని నా ఆత్మ శపిస్తుంది." అందువల్ల, విషయం దైవ ప్రవక్త (స) గురించినదైనా సరే, అల్లాహ్ స్థాయిని అవమానించే విధంగా వారికి ఒక స్థానాన్ని ఇవ్వడం ప్రవక్త (స)కు ఆనందాన్ని కలిగించదు. పైగా వారి శాపానికి కారణమవుతుంది. అంతేకాక మరణ సమయంలో పలికిన శాపానికి ఎంతో గొప్ప ప్రాధాన్యత ఉంటుంది.

నిజమైన మతాన్ని అనుసరించని వారిలో కూడా, ఉదాహరణకు అనేక మంది హిందువులలో మరణ సమయంలో పలికే శాపానికి భయం ఉంటుంది. తల్లిదండ్రులు మరణ సమయంలో చేసే ప్రార్థనలు లేదా శాపాలకూ ప్రజలు భయపడతారు. అలాంటప్పుడు, సమస్త ప్రవక్తలకు నాయకుడైన దైవ ప్రవక్త (స) మరణ క్షణంలో ఇలాంటి మాటలు పలికితే దాని ప్రాముఖ్యత ఎంత గొప్పదో ఆలోచించండి! ఇది ఎంత తీవ్రమైన హెచ్చరికో, మరియు మనం దాని నుండి మనలను కాపాడుకోవడం ఎంత అవసరమో స్పష్టమవుతుంది.

దైవ ప్రవక్త (స) వారి పవిత్ర సమాధి వద్ద ఇలాంటి ఆచారాలు జరగవు; నేను ముందే చెప్పినట్లుగా, అవి సంతులు మరియు సాధులు అని పిలవబడే పవిత్రుల సమాధుల వద్ద మాత్రం జరుగుతున్నాయి. ఇలాంటి ఆచారాలు దైవ ప్రవక్త (స) వారు పలికిన అదే శాప పరిధిలోకి వస్తాయి.

**(ఖుత్బాత్-ఏ-మహ్మూద్, భాగం 20, పుటలు 600-601)**

కాబట్టి, దైవ ప్రవక్త (స) వారి నిజమైన సేవకుడిని అనుసరిస్తున్నామని చెప్పుకునే మనం ప్రత్యేకంగా జాగ్రత్తగా ఉండాలి. దైవ ఏకత్వం యొక్క నిజమైన స్వరూపాన్ని అర్థం చేసుకోవడానికి, దానిని స్థాపించేందుకు దైవ ప్రవక్త (స) వారికి ఉన్న లోతైన బాధ మరియు చింతనను గ్రహించడానికి, మరియు నిజమైన ఏకేశ్వం వాదులుగా మారడానికి ప్రతి ప్రయత్నం చేయాలి. అల్లాహ్ మనకు అలా చేయగల సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా!.

ప్రపంచంలోని యుద్ధ పరిస్థితులు కూడా రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. అమెరికా మరియు ఇజ్రాయిల్ ప్రపంచ వ్యాప్తంగా, ముఖ్యంగా ముస్లిం ప్రపంచంలో తమ ఆధిపత్యాన్ని స్థాపించడానికి ప్రయత్నిస్తున్నాయి. పాలస్తీనాలో ఘర్షణ ప్రారంభంలో ఇజ్రాయిల్ ప్రధానమంత్రి పేర్కొన్నట్లుగా, ఆ ప్రాంతపు పటమే కాకుండా అరబ్ ప్రపంచపు పటం కూడా మారుతుందని చెప్పబడింది. ఇవి భౌగోళిక-రాజకీయ పరిస్థితులను మార్చే ప్రయత్నాలే. ఈ శక్తులు ఏ దిశగా కదులుతున్నాయో ముస్లిం ప్రపంచం మేల్కొనాలి. ముస్లిం దేశాల మధ్య ఐక్యత చాలా అవసరం.

పాకిస్తాన్, ఇరాన్ మరియు కొన్ని ఇతర దేశాల మధ్య అమెరికాతో శాంతి చర్చలకు మధ్యవర్తిత్వం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. అరబ్ దేశాలు కూడా నష్టాలను ఎదుర్కొంటున్నందున, ఆ దృష్టికోణంలో పాకిస్తాన్ ప్రయత్నాలు చేస్తోంది. అయితే ఇరాన్‌లోని కొన్ని వర్గాలు ఈ ప్రయత్నాలపై అనుమానాలు వ్యక్తం చేశాయి. ఇరాన్‌లోని కొంతమంది నిపుణులు మరియు వ్యాఖ్యాతలు, పాకిస్తాన్ అమెరికా దళాల శిక్షణకు సహాయం చేస్తోందని లేదా ఇరాన్ సరిహద్దుల వద్ద ఇరాన్‌కు వ్యతిరేకంగా పనిచేసే సమూహాలకు సహకరిస్తోందని ఆరోపించేంత వరకు వెళ్లారు. ఇలాంటి ఆరోపణలు పూర్తిగా ఆధార రహితమైనవి. పాకిస్తాన్ వాటిని స్పష్టంగా ఖండించింది.

శత్రువు ఇలాంటి పరిస్థితులను ఉపయోగించుకుని విభేదాలు సృష్టించాలని, తద్వారా ముస్లిం దేశాలు ఎప్పటికీ ఏకం కాకుండా లేదా ఒకరి కొకరు మద్దతు ఇవ్వకుండా ఉండాలని చూస్తున్నాడు.

అందువల్ల ప్రార్థనల అవసరం ఎంతో ఉంది. ఈ విషయంలో కూడా నిజమైన హృదయంతో ప్రార్థించగల సామర్థ్యాన్ని అల్లాహ్ మనకు ప్రసాదించుగాకా!. అలాగే ముస్లిం దేశాలను నిజమైన ఐక్యత బంధంతో ఏకం చేయుగాకా!.




**బదర్ ప్రతులను సంరక్షించండి:-**

ఈ వార్తా పత్రిక లౌకిక కలుషితాల నుండి అతీతమైన ఆధ్యాత్మిక మరియు ప్రాపంచిక జ్ఞానానికి ఒక అమూల్యమైన నిధి. ఇది సమాజపు ఆశయాలు మరియు అవసరాలను నెరవేర్చుతుంది. బదర్‌లో ఖుర్ఆన్ సూక్తులు, ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి హదీస్‌లు, అలాగే హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారి ఉపదేశాలు మరియు రచనలు మాత్రమే కాకుండా, అనేక పవిత్రమైన ఉల్లేఖనాలు కూడా ఉంటాయి. ఈ విషయాలను అధ్యయనం చేయడం, ఇతరులకు చేరవేయడం, వాటిని ఆచరణలో పెట్టడం, అలాగే మన పిల్లల విద్యా మరియు నైతిక శిక్షణ కోసం ఉపయోగించడం మనందరి బాధ్యత.

ఈ లక్ష్యాలన్నింటినీ సాధించడానికి, బదర్ ప్రతులను సంరక్షించి, వాటిని క్రమబద్ధంగా రికార్డులలో భద్రపరచడం ఒక ముఖ్యమైన బాధ్యత.

ధార్మిక పరమైన విద్య మరియు నైతిక శిక్షణకు సంబంధించిన ఈ విషయాలు జమాఅత్ సభ్యులందరి నుండి గౌరవాన్ని కోరుకుంటాయి. ఇతర పాత వార్తాపత్రికలతో కలిసి దీనిని వ్యర్థ కాగితంగా అమ్మడం వంటివి చేసినట్లయితే దాని గౌరవాన్ని అవమానపరచినట్లే అవుతుంది. ఒకవేళ దానిని భద్రపరచడం సాధ్యం కాకపోతే, ఈ పవిత్ర రచనలకు అవమానం జరగకుండా మరియు ఎటువంటి అపవాదులకు లేదా విమర్శలకు కారణం కాకుండా జాగ్రత్తగా నిర్వర్తించాలి.

జమాఅత్ సభ్యులు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపించి, ఈ ప్రచురణ ద్వారా సంపూర్ణ ప్రయోజనం పొందుతూ, పై సూచనలను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారని ఆశిస్తున్నాము.

**(సంపాదక మండలి)**

**ప్రపంచ అహ్మదీయ్య జమాఅత్ సభ్యులకు ఒక ముఖ్య ప్రకటన:**

మన ప్రియతమ ఖలీఫా, అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి శుభప్రదమైన సూచన మేరకు తమను తాము ఆధ్యాత్మికపరమైన పటిష్టమైన కోటలో చేర్చుకొనుటకు ఈ రోజు మీరు ఈ క్రింది దుఆలను పఠించారా?.

(1) سُبْحَانَ اللّٰهِ وَبِحَمْدِهٖ سُبْحَانَ اللّٰهِ الْعَظِيْمِ اَللّٰهُمَّ صَلِّ عَلٰى مُحَمَّدٍ وَّاٰلِ مُحَمَّدٍ

సుబ్‌హానల్లాహి వబిహమ్‌దిహీ సుబ్‌హానల్లాహిల్ అజీమ్ అల్లాహుమ్మ సల్లెఅలా ముహమ్మదిన్ వ్వ అలే ముహమ్మద్. (200 సార్లు పఠించవలెను)

(2) اَسْتَغْفِرُ اللّٰهَ رَبِّيْ مِنْ كُلِّ ذَنْبٍ وَّاَتُوْبُ اِلَيْهِ

అస్తఘ్‌ఫిరుల్లాహ రబ్బి మిన్‌కుల్లి జన్‌బిన్ వ్వఅతూబు ఇలైహి.
**100 సార్లు పఠించవలెను.**

(3) رَبِّ كُلُّ شَيْءٍ خَادِمُكَ رَبِّ فَاحْفَظْنِيْ وَانْصُرْنِيْ وَارْحَمْنِيْ

రబ్బికుల్లి షైయిన్ ఖాదిముక రబ్బి ఫాహ్‌ఫజ్‌నీ వన్‌సుర్‌నీ వర్‌హమ్‌నీ.
**100 సార్లు పఠించవలెను.**

(25 సం॥పైబడిన వారు పైన పేర్కొనబడినట్లుగా పఠించవలెను. 15 నుండి 25 సం॥ల వారు 100సార్లు, 15సం॥ల కంటే తక్కువ వయస్సు గలవారు 33 సార్లు, చిన్న పిల్లల తరుపున వారి తల్లిదండ్రులు 3నుండి 4 సార్లు పఠిస్తూ, పిల్లలతో కూడ పఠింపజేయవలెను.)

**వర్తమాన ఖలీఫా వాఖ్యములు**

**"అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు."**
**(జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)**

**దుఆ ఆశించువారు:** ***Darga sb, jamat AhmadiyyaVizag (A.P)***

## సీరత్ ఖాతమున్నబియ్యీన్ (సల్లల్లాహు అలైహి వసల్లం):-

سیرت خاتم النبیین صلی اللہ علیہ وآلہ وسلم

**రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).**

**(గత సంచిక తరువాత)**

ఈ సంఘటనను ఖుర్ఆన్ ఈ విధంగా ప్రస్తావిస్తుంది:

**బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం.**

اَلَمْ تَرَ كَيْفَ فَعَلَ رَبُّكَ بِاَصْحٰبِ الْفِيْلِ ۝ اَلَمْ يَجْعَلْ
كَيْدَهُمْ فِيْ تَضْلِيْلٍ ۝ وَّاَرْسَلَ عَلَيْهِمْ طَيْرًا اَبَابِيْلَ ۝ تَرْمِيْهِمْ بِحِجَارَةٍ
مِّنْ سِجِّيْلٍ ۝ فَجَعَلَهُمْ كَعَصْفٍ مَّاْكُوْلٍ ۝

"అపార దయామయుడు పరమ కారుణ్యమూర్తి అల్లాహ్ పేరుతో. నీ ప్రభువు ఏనుగు వారితో ఎలా వ్యవహరించాడో నీవు చూడలేదా?. వారి కుట్రను ఆయన విఫలం చేయలేదా?. అతడు వారిపై గుంపులు గుంపులుగా పక్షులను పంపాడు. అవి వారిపై రాళ్ళు ఉన్న మట్టి పెడ్డలతో దాడి చేయుచుండెను. చివరకు అతడు వారిని తినిన పొట్టు వలె చేశాడు." (సూరతుల్ ఫీల్, :1-5)

ఈ దాడి చరిత్రలో "అస్హాబుల్ ఫీల్" (ఏనుగు వారు) అనే పేరుతో ప్రసిద్ధి చెందింది. ఎందుకంటే అబ్రహా సైన్యంలో ఒక ఏనుగు లేదా కొన్ని కథనాల ప్రకారం అనేక ఏనుగులు ఉన్నవి. మక్కా ప్రజలు అంతకుముందు ఏనుగులను చూడలేదు కాబట్టి అవి వారికి విచిత్రంగా అనిపించాయి. అందువల్ల వారు దండయాత్ర చేసిన వారిని "ఏనుగు వారు" అని పిలిచారు. ఆ సంవత్సరాన్ని కూడా "ఆముల్ ఫీల్" (ఏనుగు సంవత్సరం) అని పిలిచారు. అబ్రహా సైన్యం నాశనం కావడంతో కాబా గౌరవం మరియు ఖురైష్ తెగ ప్రతిష్ఠ కూడా ఎంతగానో పెరిగి పోయింది. ఫలితంగా ఇతర అరబ్ తెగలు వారిని ఇంతకు ముందుకంటే మరింత గౌరవంతో, మర్యాదతో చూడసాగాయి.

**అబ్దుల్లా వివాహం:-**

ఏనుగు సైన్యం (అస్హాబుల్-ఫీల్) సంఘటనకు కొన్ని నెలల ముందు, అబ్దుల్ ముత్తలిబ్ తన కుమారుడు అబ్దుల్లాకు బను జుహ్రా వంశానికి చెందిన గౌరవనీయమైన మరియు సద్గుణసంపన్నురాలైన ఆమినా బింత్ వహబ్‌తో వివాహం జరిపించాడు. ఆ సమయంలో అబ్దుల్లా వయస్సు ఇరవై ఐదు సంవత్సరాలు లేదా కొన్ని కథనాల ప్రకారం పదిహేడు సంవత్సరాలు. ఇదే సందర్భంలో అబ్దుల్ ముత్తలిబ్ స్వయంగా ఆమినా బంధువైన హాలా బింత్ వహబ్‌ను వివాహం చేసుకున్నాడు. హమ్జా హాలా గర్భం నుండి జన్మించాడు.

**అబ్దుల్లా మరణం:-**

దైవ సంకల్పం ప్రకారం, వివాహం జరిగిన తర్వాత అబ్దుల్లాకు ఎక్కువ కాలం జీవించే అవకాశం లభించలేదు. కొంతకాలానికే ఆయన వ్యాపార నిమిత్తం సిరియాకు ప్రయాణించాడు. తిరుగు ప్రయాణంలో అనారోగ్యానికి గురై యస్రబ్ (మదీనా)లోనే ఆగిపోయాడు. అక్కడే ఆయన మరణించాడు. బను నజ్జార్ తెగకు చెందిన తన బంధువుల మధ్య ఆయనను సమాధి చేశారు. ఆ సమయంలో ఆయన భార్య ఆమినా గర్భవతిగా ఉన్నారు. అబ్దుల్లా తన ఇంకా జన్మించని బిడ్డ కోసం విడిచి పెట్టిన ఆస్తి చాలా స్వల్పమైనదే అయినప్పటికీ ప్రస్తావించదగినది. అది ఐదు ఒంటెలు, కొన్ని మేకలు, మరియు ఉమ్మ్ అయ్మన్ అనే ఒక సేవకురాలు. ఈ వారసత్వం భవిష్యత్తులో రెండు లోకాలకూ నాయకుడిగా నిలవబోయే శిశువు కోసం మిగిల్చబడింది.

తన కుమారుడు అబ్దుల్లా అనారోగ్యంగా ఉన్నాడని తెలిసిన వెంటనే అబ్దుల్ ముత్తలిబ్ తన పెద్ద కుమారుడు హారిస్‌ను మదీనాకు పంపించాడు, అబ్దుల్లాను తన వెంట తిరిగి తీసుకురావాలని ఆదేశించాడు. అయితే హారిస్ అక్కడికి చేరుకునేలోపే అబ్దుల్లా మరణించాడు. కావున తిరిగి వచ్చి తన వృద్ధ తండ్రికి అతని ప్రియమైన కుమారుడు ఈ ప్రపంచాన్ని విడిచిపోయాడని తెలియజేశాడు. ఆ సమయంలో అబ్దుల్ ముత్తలిబ్ అనుభవించిన దుఃఖాన్ని ఊహించవచ్చు. అయితే అంతకంటే ఎక్కువ బాధ ఆమినా హృదయాన్ని తాకి ఉండాలి. వివాహం జరిగిన కొద్ది కాలానికే, విదేశంలో ఉన్న తన భర్తను కోల్పోయి ఆమె వితంతువుగా మిగిలిపోయింది. ముఖ్యంగా సిగ్గు, వినయం ఎక్కువగా కలిగిన యువ వధువులు తమ బాధను బహిరంగంగా వ్యక్తం చేయలేక, అంతరంగంలోనే భరించాల్సి వస్తుంది. ఈ విషయం వలన ఆమినా ఎంతటి వేదనను అనుభవించి ఉండవచ్చో అర్థం చేసుకోవచ్చు. అయితే త్వరలోనే దేవుని ఓదార్పు ఆమెకు లభించింది.

ఆ రోజుల్లో ఆమినా ఒక స్వప్నం చూశారు. ఆ స్వప్నంలో ఆమెకు ఒక కుమారుడు జన్మించినట్లు కనిపించింది. అలాగే ఆ బాలుడికి "ముహమ్మద్ (స)" అని పేరు పెట్టాలని ఆమెకు చెప్పబడింది. మరో స్వప్నంలో, తన అంతరంగం నుండి ఒక ప్రకాశవంతమైన వెలుగు వెలువడి దూర ప్రాంతాలన్నిటికీ వ్యాపించినట్లు ఆమె చూశారు.

### పవిత్ర జననం:-

ఆమినా గారి గర్భంలో ఉన్న ఆశీర్వదించబడిన శిశువు లోకానికి వెలుగుగా అవతరించే సమయం సమీపించింది. ప్రసవ దినాలు దగ్గరపడుతున్నాయి. ఆమె బనూ హాషీం వంశస్థుల నివాస ప్రాంతంలో ఉండేవారు. తన మరణించిన భర్త జ్ఞాపకాన్ని చిరస్థాయిగా నిలబెట్టే బిడ్డ ఈ లోకంలోకి వచ్చి, తన దుఃఖ భారిత హృదయానికి ఓదార్పు, సాంత్వన కలిగించే క్షణాన్ని ఆమె ఎదురుచూస్తూ ఉండేవారు.

ఏనుగు సైన్య సంఘటన (ఆముల్ ఫీల్) జరిగిన ఇరవై ఐదు రోజుల తరువాత, హిజ్రీ క్యాలెండర్ ప్రకారం రబీఉల్ అవ్వల్ 12వ తేదీన, అంటే క్రీ.శ. 570 ఆగస్టు 20న, లేదా ఇటీవలి మరియు బహుశా మరింత ఖచ్చితమైన పరిశోధన ప్రకారం రబీఉల్ అవ్వల్ 9వ తేదీన, అంటే క్రీ.శ. 571 ఏప్రిల్ 20వ తేదీ సోమవారం ఉదయం, అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) జన్మించారు.

ప్రవక్త (స) జననం ఏనుగు సైన్య సంఘటన జరిగిన కొద్ది కాలానికే జరగడం ఒక దైవ సంకేతంగా భావించబడింది. ఎలా అల్లాహ్ కాబాపై జరిగిన బాహ్య దాడిని విఫలం చేశాడో, అలాగే ఇప్పుడు అసత్యం, విగ్రహారాధనలను అణచివేసి, అల్లాహ్ యొక్క నిజమైన ధర్మాన్ని స్థాపించే సమయం వచ్చిందని అది సూచించింది. పవిత్ర ఖుర్ఆన్‌లో ఏనుగు సైన్య సంఘటనను ప్రస్తావించడం కూడా ఈ ఉద్దేశానికేనని తెలుస్తుంది.

శిశువు జన్మించిన వెంటనే ఆమినా గారు అబ్దుల్ ముత్తలిబ్ గారికి సమాచారం పంపించారు. ఆయన అపారమైన ఆనందంతో వెంటనే వచ్చారు. ఆమినా గారు శిశువును ఆయనకు చూపించి, ఒక కలలో ఈ బిడ్డకు "ముహమ్మద్" అనే పేరు పెట్టాలని తనకు సూచించబడిందని చెప్పారు. అబ్దుల్ ముత్తలిబ్ ఆ శిశువును తన చేతుల్లోకి తీసుకొని అల్లాహ్ గృహమైన కాబా వద్దకు వెళ్లి అల్లాహ్‌కు కృతజ్ఞతలు సమర్పించారు. అనంతరం బిడ్డకు "ముహమ్మద్" అని పేరు పెట్టారు. ఈ పేరుకు అర్థం "ఎంతో ప్రశంసించబడే వ్యక్తి". ఆ తరువాత ఆనందంగా బిడ్డను తిరిగి అతని తల్లికి అప్పగించారు.

చరిత్రకారులు ప్రవక్త (స) జనన సమయంలో కొన్ని అసాధారణ సంఘటనలు జరిగాయని పేర్కొన్నారు. ఉదాహరణకు, పర్షియా చక్రవర్తి కిస్రా రాజ్యంలో భయంకరమైన భూకంపం సంభవించి, దాని పద్నాలుగు గోపురాలు కూలిపోయాయని, శతాబ్దాలుగా నిరంతరం వెలుగుతున్న పర్షియన్ల పవిత్ర అగ్ని అకస్మాత్తుగా ఆరిపోయిందని, కొన్ని నదులు, ఊటలు ఎండిపోయాయని, అలాగే ప్రవక్త గారి ఇంటిలోనూ అనేక అద్భుత సూచనలు కనిపించాయని వారు వర్ణించారు. అయితే, ఈ కథనాలలో ఎక్కువ భాగం బలహీనమైన ఉల్లేఖనాలపై ఆధారపడినవిగా పరిగణించబడుతున్నాయి.

మరో కథనం, ఇది బహుశా విశ్వసనీయమైనదిగా భావించబడుతుంది, ప్రవక్త (స) జన్మించిన కాలంలో ఆకాశంలో అసాధారణంగా ఎక్కువ సంఖ్యలో ఉల్కలు (పడిపోతున్న నక్షత్రాలు) కనిపించాయని చెబుతుంది.

ఇంకొక కథనం ప్రకారం, ప్రవక్త (స) సహజంగానే సున్నత్ (ఖత్నా) చేయబడిన స్థితిలో జన్మించారు. ఇది నిజమైతే ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఇటువంటి సహజ లక్షణాలు అప్పుడప్పుడు నవజాత శిశువులలో కూడా కనిపిస్తాయి.

ప్రవక్త (స) జన్మతః కలిగిన మరో శారీరక లక్షణం వారి వీపు ఎడమవైపున చిన్నగా పైకి లేచిన మాంసపు ముద్ద ఉండటం. ముస్లింలలో దీనిని సంప్రదాయంగా "ఖాతమున్ నుబువ్వత్" (ప్రవక్తత్వ ముద్ర) అని పిలుస్తారు.

**పాలిచ్చిన కాలం మరియు బాల్యదశ:-**

మక్కాలోని ఉన్నత కుటుంబాలలో తల్లులు తమ పిల్లలకు స్వయంగా పాలివ్వడం ఆనవాయితీ కాదు. బదులుగా, పసిపిల్లలను నగరానికి వెలుపల నివసించే గ్రామీణ తెగల పాలిచ్చే మహిళల (దాయాదుల) సంరక్షణకు అప్పగించేవారు.

---

**అహ్‌దీస్ బోధనలు**

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు:
**"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."**
(కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్దీ, 38671)

**దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)***

---

**అహ్‌దీస్ బోధనలు**

**"ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణవేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.**
(మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్)

**దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb***

దీని వల్ల పిల్లలు ఎడారి స్వచ్ఛమైన గాలిలో పెరిగి ఆరోగ్యవంతులుగా, బలవంతులుగా మారడమే కాకుండా, స్వచ్ఛమైన, శుద్ధమైన అరబీ భాషను కూడా నేర్చుకునేవారు.

ప్రవక్త (స) జన్మించిన మొదటి రోజులలో మొదట వారి తల్లి పాలిచ్చారు. తరువాత వారికి సువైబా (తువైబా) అనే మహిళ పాలిచ్చారు. ఆమె ప్రవక్త గారి పిన తండ్రి అబూ లహబ్ యొక్క బానిస. తన అనాథ మేనల్లుడు జన్మించిన ఆనందంలో అబూ లహబ్ ఆమెకు విముక్తి కల్పించాడు. అదే సువైబా ప్రవక్త గారి పినతండ్రి హమ్జా (ర) గారికీ పాలిచ్చారు. అందువల్ల హమ్జా (ర) రక్త సంబంధం ప్రకారం ప్రవక్త గారి పినతండ్రి అయినప్పటికీ, పాల సంబంధం ప్రకారం ఆయనకు సోదరుడయ్యారు. ప్రవక్త (స) సువైబా చేసిన ఈ చిన్న సేవను జీవితాంతం మరచిపోలేదు. ఆమె జీవించి ఉన్నంతకాలం ఆమెకు సహాయం చేస్తూనే ఉండేవారు. ఆమె మరణించిన తరువాత కూడా ఆమెకు ఎవరైనా బంధువులు మిగిలి ఉన్నారా? అని విచారించారు. కానీ ఆమెకు ఎవరూ లేరని తెలిసింది.

సువైబా తరువాత, ప్రవక్త (స)ను శాశ్వతంగా పాలిచ్చేందుకు హలీమా అనే మహిళకు అప్పగించారు. ఆమె హవాజిన్ తెగకు చెందిన బనూ సఅద్ వంశానికి చెందినవారు. ఇతర మహిళలతో కలిసి పాలిచ్చే శిశువును వెతుకుతూ మక్కాకు వచ్చారు. మొదట్లో హలీమా ఒక అనాథ బాలుడిని తీసుకెళ్లడానికి ఇష్టపడలేదు. ఎందుకంటే తండ్రి జీవించి ఉన్న పిల్లవాడిని తీసుకుంటే ఎక్కువ బహుమతులు, గౌరవాలు లభిస్తాయని ఆమె ఆశించింది. అందుకే మొదట ముహమ్మద్ (స)ను తీసుకెళ్లడానికి వెనుకంజ వేసింది. కానీ చివరకు మరే ఇతర శిశువు దొరకకపోవడంతో, తనతో వచ్చిన మిగతా మహిళలందరికీ పిల్లలు దొరికి పోయినందున, ఖాళీ చేతులతో వెళ్లడం కంటే ఈ అనాథ బాలుడిని తీసుకెళ్లడమే మంచిదని భావించింది. అలా ఆమె ప్రవక్త (స)ను తన ఇంటికి తీసుకెళ్లింది.

కొద్ది రోజులకే హలీమాకు తాను ఇంటికి తీసుకొచ్చిన ఈ బాలుడు అసాధారణమైన మహోన్నత స్థానాన్ని పొంద బోతున్నాడని అర్థమైంది. ఆమె స్వయంగా చెప్పిన ప్రకారం, ప్రవక్త (స) తమ ఇంటికి రాకముందు వారు తీవ్రమైన పేదరికంలో జీవించేవారు. కానీ వారు (స) వచ్చిన తరువాత వారి కష్టాలు తీరిపోయి, సమృద్ధిగా మారాయి. తమ ప్రతి వస్తువులోనూ అల్లాహ్ ప్రసాదించిన ఆశీర్వాదాలను వారు అనుభూతి చెందడం ప్రారంభించారు. హలీమాకు అబ్దుల్లాహ్ అనే కుమారుడు ఉండే వాడు. అతను కూడా ప్రవక్త (స)తో కలిసి పాలు తాగేవాడు. ఆమెకు షైమా అనే పెద్ద కుమార్తె కూడా ఉండేది. ఆమె ప్రవక్త (స)ను ఎంతో ప్రేమగా చూసుకునేది మరియు వారి(స)పై అపారమైన అభిమానాన్ని కలిగి ఉండేది.

రెండు సంవత్సరాల పాలిచ్చే కాలం పూర్తయిన తరువాత, ఆచారం ప్రకారం హలీమా ప్రవక్త ముహమ్మద్ (స) గారిని తిరిగి మక్కాకు తీసుకు వచ్చింది. అయితే అప్పటికే ఆమెకు ప్రవక్త (స) పట్ల ఎంతో గాఢమైన ప్రేమ కలిగింది. సాధ్యమైతే, వారి (స) తల్లి అనుమతి తీసుకుని మళ్లీ తనతో పాటు తీసుకెళ్లాలని ఆమె హృదయ పూర్వకంగా కోరుకుంది. అందుకే ఆమె ఎంతో వేడుకుంటూ ఇలా అంది: "దయచేసి ఈ బిడ్డను ఇంకొంతకాలం నా దగ్గర ఉండనివ్వండి. నేను వారిని అన్ని విధాలా ఎంతో జాగ్రత్తగా చూసుకుంటాను."

మొదట ఆమినా గారు దీనికి అంగీకరించలేదు. కానీ హలీమా పట్టుదలగా కోరడం చూసి, అలాగే ఆ రోజులలో మక్కా వాతావరణం కొంత అనుకూలంగా లేకపోవడంతో బయట ప్రాంతంలోని గాలి ఆరోగ్యకరంగా ఉంటుందని భావించి, చివరకు ఆమె ఒప్పుకుంది. హలీమా ఆనందంగా ప్రవక్త (స) గారిని తన ఇంటికి తిరిగి తీసుకెళ్లింది. సుమారు నాలుగు సంవత్సరాల వయస్సు వచ్చే వరకు ప్రవక్త (స) ఆమె వద్దే ఉన్నారు. ఆ కాలంలో వారు బను సఅద్ తెగకు చెందిన అబ్బాయిలు, అమ్మాయిలతో కలిసి ఆడుకుంటూ పెరిగారు. ఆ తెగ మాట్లాడే భాష ఎంతో స్వచ్ఛమైనది, శుద్ధమైనది, వాక్చాతుర్యంతో నిండినది. ప్రవక్త (స) కూడా అదే భాషను నేర్చుకున్నారు.

హలీమా ప్రవక్త (స) గారిని ఎంతో ప్రేమగా చూసుకునేది. ఆ తెగలోని ప్రజలందరూ కూడా వారిని ఎంతో ఆప్యాయతతో ప్రేమించేవారు. అయితే వారికి నాలుగు సంవత్సరాల వయస్సు వచ్చినప్పుడు ఒక సంఘటన జరిగింది. అది హలీమాను తీవ్రంగా భయపెట్టింది. దాని ఫలితంగా ఆమె ప్రవక్త (స) గారిని తిరిగి మక్కాకు తీసుకువచ్చి వారి తల్లి ఆమినా గారి సంరక్షణలో అప్పగించింది.

చరిత్రలో ఈ సంఘటన ఇలా నమోదు చేయబడింది: ఒక రోజు ప్రవక్త (స) తన పాలసోదరునితో కలిసి ఆడుకుంటుండగా, సమీపంలో పెద్దవారు ఎవరూ లేరు. అకస్మాత్తుగా తెల్లని వస్త్రాలు ధరించిన ఇద్దరు వ్యక్తులు ప్రత్యక్షమయ్యారు. వారు ప్రవక్త (స) గారిని పట్టుకొని నేలపై పడుకోబెట్టి వారి ఛాతిని చీల్చారు. ఈ దృశ్యాన్ని చూసిన ఆయన పాలసోదరుడు అబ్దుల్లాహ్ ఇబ్నే హారిస్ భయంతో తన తల్లిదండ్రుల వద్దకు పరుగెత్తి వెళ్లి, "ఇద్దరు వ్యక్తులు నా ఖురైషీ సోదరుడిని పట్టుకుని ఆయన ఛాతిని చీలుస్తున్నారు!" అని అరిచాడు.

ఈ విషయం విన్న వెంటనే హారిస్, హలీమా ఇద్దరూ అక్కడికి పరుగెత్తు కుంటూ వచ్చారు. అక్కడ ఎవరూ కనిపించలేదు. అయితే ప్రవక్త (స) గారు భయంతో నిలబడి ఉన్నారు. వారి ముఖవర్ణం మారిపోయింది. హలీమా వెంటనే వారిని తన ఒడిలోకి తీసుకుని, "నా బిడ్డా, ఏమైంది?" అని అడిగింది. (తదుపరి సంచికలో)

## సీరతుల్ మహ్దీ (అలైహిస్సలాతు వస్సలాం):- سیرت المہدی علیہ السلام

రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).

అపార దయామయుడు పరమకారుణ్య మూర్తి అల్లాహ్ పేరుతో:

(10) గౌరవనీయులైన మా తల్లి గారు నాకు ఇలా తెలిపారు: ఒకసారి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారితో ఇలా చెప్పారు. పెద్ద మిర్జా సాహిబ్ (అనగా హజ్రత్ మసీహ్ మౌవూద్ గారి తండ్రి) కాశ్మీర్‌లో ఉద్యోగం చేస్తున్న కాలంలో, ఆయన తల్లి తరచుగా ఇలా అనేవారు: "ఈ రోజు నా మనసు చెబుతోంది, కాశ్మీర్ నుండి ఏదో వస్తుంది." నిజంగానే అదే రోజు కాశ్మీర్ నుండి ఒక దూత వచ్చేవాడు. కొన్ని సందర్భాల్లో ఆమె ఈ మాట చెప్పగానే ఇంటి తలుపు తట్టిన శబ్దం వినిపించేది. విచారిస్తే, కాశ్మీర్ నుండి ఒక వ్యక్తి వచ్చినట్లు తెలిసేది. మరల మా తల్లిగారు ఇలా తెలిపారు: మీ తాతగారు కొన్ని నెలలకు ఒకసారి కాశ్మీర్ నుండి ఒక విశ్వసనీయ సేవకుడి ద్వారా ఉత్తరాలు మరియు డబ్బు పంపించే వారు. ఆ నగదు సాధారణంగా వెండి, బంగారు నాణేల రూపంలో ఉండేది. వాటిని ఒక మందమైన వస్త్రంతో చేసిన జాకెట్ లాంటి సంచి లోపలి పొరలో కుట్టి దాచేవారు. ఆ సేవకుడు ప్రయాణమంతా దానిని ధరించి వచ్చేవాడు. ఖాదియాన్ చేరుకున్న తర్వాత, ఆ వస్త్రాన్ని తీసి ఇంట్లోకి పంపించేవాడు. ఇంటివారు దానిని తెరిచి డబ్బును తీసుకుని, తిరిగి ఆ వస్త్రపు సంచిని ఇచ్చేవారు. మరల ఇలా తెలిపారు: మీ తాతగారు కాశ్మీర్‌లో ("సూబా") ప్రాంతీయ గవర్నర్ హోదాలో పనిచేసే వారు. అప్పుడే హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని గారు కూడా పై అంతస్తు నుండి దిగి వచ్చి ఇలా అన్నారు: "నేడు బ్రిటిష్ పాలనలో డిప్యూటీ కమిషనర్లు, కమిషనర్లు ఉన్నట్లే, ఆ కాలంలో కాశ్మీర్‌లో 'సూబాలు' ప్రాంతీయ గవర్నర్లుగా కొనసాగేవారు. " ఈ భవదీయుడు తెల్పునదేమనగా, మా బాపమ్మ (దాది) గారు, అనగా హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారి తల్లిగారు. వారి పేరు చిరాగ్ బీబీ. వారు మా తాతగారి జీవిత కాలంలోనే మృతిచెందారు. వారికి హజ్రత్ మసీహ్ మౌవూద్ గారిపై ఎంతో ప్రేమ ఉండేది. అలాగే హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారికి కూడ వారిపై (తమ తల్లిగారిపై) అపారమైన ప్రేమ ఉండేది. హుజూర్ (అ) వారి తల్లి గారిని గురించి మాట్లాడిన ప్రతిసారి, హుజూర్ (అ) గారి కన్నులలో కన్నీళ్లు తిరుగుతుండటాన్ని నేను అనేకసార్లు చూశాను.

---

**( 1వ పేజీ తరువాత తఫ్సీర్ )**

అప్పటి నుండి ఇప్పటి వరకు నేను ఇంట్లో ఉండి, మీలో నాయకత్వానికి నాకంటే ఎక్కువ అర్హత కలిగిన వారు ఎవరైనా ఉన్నారా అని ఆలోచించాను, తద్వారా ఈ బాధ్యతను వారికి అప్పగించి నేను విముక్తి పొందగలను. అయితే ఎంతో ఆలోచించినప్పటికీ మీలో అలాంటి వ్యక్తి నాకు కనిపించలేదు. అందువల్ల, ఓ ప్రజలారా! జాగ్రత్తగా వినండి. నేను ఈ పదవికి అర్హుడిని కాను. అంతేకాక, నా తండ్రి గానీ, నా తాత గానీ ఈ పదవికి అర్హులు కారని కూడా నేను స్పష్టంగా చెప్పదలచుకున్నాను. నా తండ్రి స్థాయి హుసైన్ (రజి) గారి స్థాయి కంటే చాలా తక్కువ. అలాగే అతని తండ్రి, హసన్ మరియు హుసైన్ (రజి) గార్ల తండ్రి స్థాయికి తక్కువ వాడు. అలీ (రజి)గారు తమ కాలంలో ఖిలాఫత్‌కు మరింత అర్హులు. వారి తర్వాత హసన్ మరియు హుసైన్ (రజి) గారులే నా తండ్రి మరియు తాత కంటే ఖిలాఫత్‌కు ఎక్కువ అర్హులు. కాబట్టి నేను ఈ అధికార పదవి నుండి వైదొలుగుతున్నాను."

**(ఖిలాఫత్-ఎ-రాషిదా, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 15, పుటలు 557--588)**

మరో సందర్భంలో, ఒక షియా వర్గానికి చెందిన మిత్రుడు హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్ గారి (రజి)ని కలవడానికి వచ్చాడు. వారు (రజి) ఆయనను ఉద్దేశించి ఇలా అన్నారు:

"మీరు షియా వర్గానికి చెందినవారు కాబట్టి, ఇమామ్ హుసైన్ (రజి) గారికి జరిగిన అన్యాయానికి అల్లాహ్ ఎలా ప్రతీకారం తీర్చుకున్నాడో గమనించండి. యజీద్ మరణించిన తరువాత అతని కుమారుడిని రాజుగా నియమించారు. అతను చేసిన మొదటి పని ప్రజలను సమీకరించి "ఓ ప్రజలారా! మీరు నన్ను రాజుగా నియమించారు. కానీ నేను దీనికి అర్హుడిని కాను. ఇక్కడ నాకంటే ఎక్కువ అర్హత కలిగిన వారు ఉన్నారు. వారిని మీ పాలకులుగా నియమించుకోండి. ఒకవేళ మీరు వారిని నియమించుకోకపోతే, ఇదిగో ఈ ఖిలాఫత్ ఇక్కడే వదిలివేస్తున్నాను. " అని అన్నాడు. కాని ప్రజలు అతనిని ఆ పదవిని స్వీకరించమని తీవ్రంగా ఒత్తిడి చేశారు. కాని యజీద్ కుమారుడు ఎంతో నీతిమంతుడు. తాను ఆ పదవికి అర్హుడిని కాదని సమాధానమిచ్చాడు. అతను ఇంటికి వెళ్ళినప్పుడు అతని కుటుంబ సభ్యులు, 'నువ్వు కుటుంబ పరువును పోగొట్టావు' అని అన్నారు. దానికి అతను, 'నేను పరువును పోగొట్టలేదు, దానిని తిరిగి నిలబెట్టాను' అని జవాబిచ్చాడు. ఈ విధంగా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇమామ్ హుసైన్ (రజి) గారి ప్రతీకారం తీర్చుకున్నాడు."

**(అల్-ఫజల్, రబ్వా, 5 జులై 1960, పుట 3)**

**(12వ పేజీ తరువాత)**

దీనిపై హజూర్ అన్వర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రోజుకు ఐదు పూటల నమాజులను క్రమం తప్పకుండా చదవాలని చెప్పారు. అన్సార్ వయస్సు మరియు బాధ్యతలను దృష్టిలో ఉంచుకుంటే, వారు నమాజుల విషయంలో పూర్తి నియమబద్ధత కలిగి ఉండాలని సూచించారు. అలాగే పవిత్ర ఖుర్ఆన్ పఠనంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతిరోజూ ఖుర్ఆన్ పారాయణం చేయాలని చెప్పారు. అదేవిధంగా ఎంటిఏ లో ప్రసారమయ్యే జుమా ప్రసంగాలను వినేందుకు కూడా శ్రద్ధ చూపించాలని సూచించారు.

మరల హజూర్ అన్వర్ మాట్లాడుతూ, అన్సార్ కోసం ఒక తబ్లీఘ్ కార్యక్రమాన్ని రూపొందించాలని చెప్పారు. వారికి అవసరమైన లిటరేచర్‌ను అందించి, ప్రజల మధ్యకు వెళ్లి వారితో సంభాషించేలా ప్రోత్సహించాలని సూచించారు. వారు కొత్త పరిచయాలను ఏర్పరచుకోవాలి, మంచి సంబంధాలను పెంచుకోవాలి మరియు తబ్లీఘ్ కార్యక్రమాలను నిర్వహించాలి. ఇకపై మొహమాటాన్ని విడిచిపెట్టి, ఈ రంగంలో చురుకుగా పనిచేయాలని హుజూర్ ప్రోత్సహించారు.

హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ ఇలా అన్నారు: "మీరు అన్సార్ సభ్యులు 40,000 కరపత్రాలను పంపిణీ చేశారని, వాటిలో 20,000 కరపత్రాలను ఒక వ్యక్తి ఒక్కడే పంపిణీ చేశాడని చెబుతున్నారు. అనగా మిగతా సభ్యులందరూ కలిసి మరో 20,000 కరపత్రాలను పంపిణీ చేశారా?."

హుజూర్ మరల ఇలా అన్నారు: "యుకే మజ్లిస్ అన్సారుల్లాహ్ " ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర "అనే పుస్తకాన్ని 50,000 ప్రతులు మరియు " ప్రపంచ సంక్షభం మరియు శాంతి, సామరస్యతల మార్గం " అనే పుస్తకాన్ని 40,000 ప్రతులు పంపిణీ చేసింది. వారు ఈ పుస్తకాలను పెద్ద సంఖ్యలో ముద్రింపజేసి, అనంతరం సరైన ప్రణాళిక మరియు వ్యవస్థీకృత విధానంతో వాటిని ప్రజలకు అందించారు."

హుజూర్ మరల ఇలా అన్నారు: "అన్సారుల్లాహ్ పేరుతో ఒక చారిటీ వాక్ నిర్వహించాలి. అలాగే ఇక్కడ చెట్లు నాటడంపై మంచి ఆసక్తి ఉంది. సంబంధిత ప్రభుత్వ శాఖలు మరియు స్థానిక అధికారులతో సరైన సంప్రదింపులు జరిపిన తర్వాత చెట్లు, మొక్కలు నాటాలి. అలాగే ఇతర ప్రజాసేవా కార్యక్రమాలలో కూడా పాల్గొనాలి.

మీ మానవతా సేవలు మరియు సంక్షేమ కార్యక్రమాలు పత్రికలు, మీడియా ద్వారా ప్రజల ముందుకు వచ్చినప్పుడు, ఇస్లాం యొక్క మంచి పనులు మరియు అందమైన రూపం వారి ముందుకు వస్తుంది. కొంతమంది తీవ్రవాదుల కారణంగా ఇస్లాం గురించి ప్రజలలో ఉన్న అపోహలు మరియు అభ్యంతరాలు తొలగిపోతాయి. అందువల్ల, మీరు వివిధ అనాథ సంస్థలకు విరాళాల చెక్కులను అందజేసేటప్పుడు, వాటిని ఒక అధికారిక కార్యక్రమం ద్వారా అందజేయాలి. ఆ కార్యక్రమానికి మీడియా ప్రతినిధులను మరియు స్థానిక అధికారులను కూడా ఆహ్వానించాలి. ఇది మనం ఎవరికైనా ఉపకారం చేస్తున్నామనే ఉద్దేశంతో కాదు. ముఖ్యంగా మీడియా ద్వారా ఇస్లాం గురించి ఏర్పడిన భయానకమైన మరియు ప్రతికూలమైన చిత్రాన్ని తొలగించడానికి మాత్రమే ఇది చేయబడుతోంది.

ఇది ఒకరకమైన ప్రదర్శన లేదా ఆడంబరం కాదు. నిజానికి ఇస్లాం యొక్క అందమైన మరియు శాంతియుతమైన ముఖచిత్రాన్ని ఇతరుల ముందు నిజాయితీతో ప్రదర్శించడానికి చేసే ప్రయత్నం మాత్రమే."

హజూర్ అన్వర్ గారు చారిటీ వాక్‌లు మరియు విరాళాల ద్వారా సేకరించిన నిధులలో 30% హ్యూమానిటీ ఫస్ట్‌కు, 70% స్థానిక సేవా సంస్థలకు ఇవ్వాలని సూచించారు. దీనివల్ల మీ పరిచయం మరియు గుర్తింపు పెరుగుతుంది, తబ్లీఘ్ (ఇస్లాం ప్రచారం) కు ఇది ఒక సాధనంగా మారుతుంది, అలాగే ఇస్లాం గురించి ఉన్న అపోహలు మరియు ప్రతికూల భావనలను తొలగించడానికి సహాయ పడుతుంది.

హజూర్ అన్వర్ గారు మరల ఇలా సూచిస్తూ, అన్సార్ సభ్యులందరు తమ ఇళ్లలో పిల్లలపై పర్యవేక్షణ వహించాలని, వారు క్రమంగా నమాజ్‌లు చదువు తున్నారా? మరియు పవిత్ర ఖుర్ఆన్ పారాయణం చేస్తున్నారా? అనే విషయాలను నిర్ధారించుకోవాలని చెప్పారు. పిల్లలను తమతో పాటు మసీదుకు తీసుకువెళ్లాలి, తద్వారా వారికి మసీదుకు రావడం అలవాటవుతుంది. వారికి ధార్మిక పరమైన విజ్ఞానంను బోధించాలి మరియు సరైన నైతిక, ఆధ్యాత్మిక శిక్షణ ఇవ్వాలి.

ఖాయిద్ తాలీముల్ ఖుర్ఆన్ మరియు వక్ఫ్-ఏ-ఆర్జీ కార్యదర్శులను ఉద్దేశించి, హజూర్ అన్వర్ గారు వక్ఫ్-ఏ-ఆర్జీ (తాత్కాలిక సేవా అంకితం) కోసం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలని ఆదేశించారు. సంవత్సరానికి రెండు లేదా మూడు సార్లు వక్ఫ్-ఏ-ఆర్జీ సేవలను నిర్వహించాలి. ఆ సమయంలో అన్సార్ సభ్యులు పిల్లలకు తరగతులు నిర్వహించి, పవిత్ర ఖుర్ఆన్ బోధించాలి, ధార్మికపరమైన విద్యను అందించాలి మరియు ఇస్లాం యొక్క ప్రాథమిక బోధనలను నేర్పించాలి.

ఈ విషయంలో క్రమం తప్పకుండా ప్రయత్నించాలని హజూర్ అన్వర్ గారు తెలిపారు. పదేపదే గుర్తుచేయడం మరియు క్రమం తప్పకుండా అనుసరించడం అవసరమని చెప్పారు.

హజూర్ అన్వర్ గారికి ఆస్ట్రేలియాలో చైనీస్ ప్రజల సంఖ్య ఎక్కువగా ఉందని ఒక నివేదిక సమర్పించబడింది. అందుకు స్పందిస్తూ హజూర్ అన్వర్ గారు మన వద్ద చైనీస్ భాషలో కూడ లిటరేచర్ అందుబాటులో ఉందని తెలిపారు. 'శాంతి, సామరస్యతల మార్గం" అనే పుస్తకం కూడా చైనీస్ భాషలోకి అనువదించ బడింది. చైనీస్ సాహిత్యాన్ని లండన్ నుండి తెప్పించాలని, అలాగే సింగపూర్‌లో కూడా చైనీస్ సాహిత్యం అందుబాటులో ఉన్నందున అక్కడి వారిని సంప్రదించాలని సూచించారు. ఈ సాహిత్యాన్ని చైనీస్ సమాజానికి పంపిణీ చేయాలి. అరబ్ ప్రజలకు అరబిక్ భాషలో లిటరేచర్ అందించాలి, ఇతర జాతుల వారికి వారి వారి భాషలలో సాహిత్యాన్ని అందించాలి.

కొన్ని పుస్తకాల ధరలు చాలా ఎక్కువగా నిర్ణయించబడ్డాయని హజూర్ అన్వర్ గారు సూచించారు. ఉదాహరణకు, " శాంతి, సామరస్యతల మార్గం " అనే పుస్తకాన్ని ఐదు డాలర్లకు విక్రయిస్తున్నారు. దాన్ని రెండు డాలర్లకు ఇవ్వాలని అన్నారు. ప్రధాన ఉద్దేశ్యం సందేశాన్ని ప్రజలకు చేరవేయడం, డబ్బు సంపాదించడం కాదని స్పష్టం చేశారు.

హజూర్ అన్వర్ గారి ప్రశ్నకు సమాధానంగా ద్వితీయ నాయిబ్ సదర్, అన్సార్ సభ్యులు సైక్లింగ్ ఎక్కువగా చేయకపోయినా, ఇతర క్రీడలలో మాత్రం పాల్గొంటారని నివేదించారు.

హజూర్ అన్వర్ గారు ఇలా వ్యాఖ్యానించారు: "వయస్సు పెరిగిన వారు తమను తాము ముసలి వారిగా భావించుకోకూడదు. నలభై సంవత్సరాలు దాటిన వెంటనే ఎవరైనా ముసలివారవలసిన అవసరం లేదు. హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ ద్వితీయులు ఒకసారి ఇలా అన్నారు: ఒక ఖాదిమ్ నలభై సంవత్సరాల వయస్సు వరకు ఖుద్దాముల్ అహ్మదియ్యాలో ఎంతో చురుకుగా మరియు శ్రద్ధగా పని చేస్తాడు. కానీ అన్సారుల్లాహ్‌లో చేరిన తరువాత ఎందుకో మందగిస్తాడు. కాబట్టి మీరు ఈ విషయంపై ఆలోచించి, మీరే మిమ్ములను పరిశీలించుకోవాలి."

హజూర్ అన్వర్ గారితో నేషనల్ మజ్లిస్-ఏ-ఆమిలా అన్సారుల్లాహ్ సమావేశం సాయంత్రం 7:30 గంటల వరకు కొనసాగింది. సమావేశం ముగింపులో అన్సార్ సభ్యులు హజూర్ అన్వర్ గారితో కలిసి ఒక సమూహ ఫోటో తీసుకునే భాగ్యాన్ని పొందారు. **(అల్ ఫజల్ ఇంటర్నేషనల్, 13 – 19 డిసెంబర్ 2013)**

---

**ఉపశాఖల వార్షిక సమావేశాలు ఖాదియాన్**

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారు మజ్లిస్ అన్సారుల్లాహ్, ఖుద్దాముల్ అహ్మదియ్య, అత్ఫాలుల్ అహ్మదియ్యకు చెందిన వార్షిక సమావేశాలు ఖాదియాన్ కొరకు 23, 24, 25 అక్టోబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. కావున నేటి నుండే ఈ పవిత్ర సమావేశాలలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సమావేశాలతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక సమావేశాలు అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక!

---

**లజ్నా ఇమాఉల్లాహ్ వార్షిక సమావేశాలు ఖాదియాన్**

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారు లజనా ఇమాఉల్లాహ్, నాసిరాతుల్ అహ్మదియ్యకు చెందిన వార్షిక సమావేశాలు ఖాదియాన్ కొరకు 23, 24, 25 అక్టోబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. కావున నేటి నుండే ఈ పవిత్ర సమావేశాలలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభి ంచగలరు. ఈ ఆధ్యాత్మిక సమావేశాలతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక సమావేశాలు అన్ని విధాలా విజయ వంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక!

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail:
teluguweeklybadar@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly **BADAR** Qadian **బదర్** తెలుగు వార పత్రిక

Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA

POSTAL REG NO GDP-38/2026-2028. Vol. 11. Thursday, 02 JUL 2026, Issue No - 27

ACT.MANAGER
ATHAR AHMAD SHAMIM
Mobile. : +91 98156 39670
e-mail managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

## సయ్యదినా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి ఆస్ట్రేలియా పర్యటన 2013.

### ఆదివారం, 20 అక్టోబర్ 2013:–

### హుజూరే అన్వర్‌తో ఆస్ట్రేలియా నేషనల్ మజ్లిస్ ఖుద్దాముల్ అహ్మదియ్యా ఆమిలా సమావేశం.

అత్ఫాల్ (పిల్లల విభాగం) సిలబస్‌కు సంబంధించి హుజూర్ అన్వర్ ఇలా పేర్కొన్నారు: వక్ఫ్–ఎ–నౌకు ఇప్పటికే ఒక ప్రత్యేక సిలబస్ ఉంది. కావున "మీరు మీ స్వంత సిలబస్‌ను రూపొందించుకోవాలి".

హుజూర్ అన్వర్ మరల ఇలా తెలిపారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఖుద్దాముల్ అహ్మదియ్యా సదర్ వక్ఫ్–ఎ–నౌ సిలబస్‌ను తీసుకొని, అవసరమైన అదనపు విషయాలను చేర్చి, దానినే సిలబస్‌గా కొనసాగిస్తూ వస్తున్నారు. కావున మీరు కూడ అలా చేయవచ్చును. అనగా వక్ఫ్–ఎ–నౌ సిలబస్‌ను తీసుకొని, అవసరమైన అంశాలను జోడించి, దానిని మీరు సిలబస్‌గా కొనసాగించవచ్చును.

హుజూర్ మరల ఇలా తెలిపారు: అహ్మదియ్యా ముస్లిం స్టూడెంట్ అసోసియేషన్ అనేక దేశాలలో చురుకుగా పనిచేస్తోంది, విశ్వవిద్యాలయాలలో సెమినార్లు నిర్వహిస్తోంది. కొన్ని సందర్భాలలో మతపరమైన అంశాలపై కూడ ఈ సెమినార్లు నిర్వహించబడతాయి, ఫలితముగా ఇస్లాం పట్ల ఉన్న అపోహలు తొలగించ బడతాయి మరియు జమాఅత్ పరిచయం పెరుగుతుంది. మరికొన్ని సందర్భాలలో పరిశోధన సంబంధిత అంశాలపై సెమినార్లు నిర్వహించబడతాయి. కావున మీరు కూడ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టవచ్చును.

ఖుద్దాముల్ అహ్మదియ్యాకు ప్రత్యేక బ్యాంక్ ఖాతా లేకపోవడం గురించి ఒక ప్రశ్న అడగబడింది. దానికి హుజూర్ ఇలా సమాధానమిచ్చారు. ఇలాంటి విషయాలలో అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా చట్టపరమైన నిబంధనలు మరియు అది చట్టబద్ధంగా సాధ్యమా కాదా అనే విషయాలను పరిశీలించాల్సి ఉంటుంది. అందువల్ల ఈ విషయంపై లిఖితపూర్వకంగా అభ్యర్ధన పంపండి, దానిని సమీక్షించి తగిన మార్గదర్శకత్వం అందిస్తాము.

చారిటీ వాక్‌ల గురించి హుజూర్ మాట్లాడుతూ, ఖుద్దాముల్ అహ్మదియ్యా తమ స్వంత ప్రత్యేక చారిటీ వాక్‌ను నిర్వహించాలి అని ఆదేశించారు. యుకే మరియు మరికొన్ని దేశాలలో జమాఅత్ తన స్వంత చారిటీ వాక్‌లను నిర్వహిస్తుందని, అన్‌సార్ మరియు ఖుద్దామ్ కూడా విడివిడిగా తమ కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు.

హుజూర్ మరల ఇలా పేర్కొన్నారు. ఖుద్దాముల్ అహ్మదియ్యా యుకే నిర్వహించిన చారిటీ వాక్ ద్వారా 3,03,000 సేకరించబడిందని, ఆ నిధులను అనంతరం వివిధ సేవా సంస్థలకు పంపిణీ చేశారు.

హుజూర్ మరల మట్లాడుతూ, హ్యూమానిటీ ఫస్ట్ పూర్తిగా వేరు సంస్థ అని చెప్పారు. ఏ చారిటీ వాక్ నిర్వహించినా అది జమాఅత్ మరియు దాని అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించబడాలని, దానికి సంబంధించిన పత్రికా మరియు మీడియా ప్రచారం కూడా ఆయా సంస్థల పేర్లతోనే జరగాలని సూచించారు.

ఒక ప్రశ్నకు సమాధానంగా హుజూర్ మాట్లాడుతూ, ఒక వ్యక్తి తన శరీర అవయవాలను దానంగా ఇవ్వడం సబబే అని చెప్పారు. దాని వల్ల అవసరంలో ఉన్న మరొకరికి ప్రయోజనం కలుగుతుందని, అవయవ దానంలో ఎటువంటి అభ్యంతరం లేదని తెలిపారు.

హుజూర్ మరల 'పిల్లల తరగతుల్లో మరియు విద్యార్థుల తరగతుల్లో ఇప్పటికే కొన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చానని పేర్కొంటూ, సభ్యులు ఎంటిఏ (ముస్లిం టెలివిజన్ అహ్మదియ్యా) కార్యక్రమాలను చూడాలి' అని సూచించారు.

స్థానిక మజ్లిస్‌ల మధ్య ఆన్‌లైన్ ఉత్తర ప్రత్యుత్తరాల గురించి అడిగిన ప్రశ్నకు హుజూర్ అన్వర్ (అయ్యదహుల్లాహు తఆలా) సమాధానమిస్తూ, 'కొన్ని ఆర్థిక విషయాలు మరియు సాధారణ వ్యవహారాల విభాగం సూచనలు సున్నితమైనవిగా ఉంటాయని, వాటిని ఆన్‌లైన్‌లో తెలుపకూడదు. కావున అలాంటి విషయాలపై కేంద్రం నుండి లిఖితపూర్వక మార్గదర్శకత్వం పొందాలని' సూచించారు.

నేషనల్ మజ్లిస్ ఖుద్దాముల్ అహ్మదియ్యా ఆమిలా సమావేశం సాయంత్రం 7:00 గంటలకు ముగిసింది.

సమావేశం ముగింపులో హుజూర్ ఆమిలా సభ్యులకు పెన్నులను బహూకరించి, వారితో కలిసి సమూహ ఫోటో దిగే గౌరవాన్ని వారికి కల్పించారు.

### హుజూర్ అన్వర్‌తో ఆస్ట్రేలియా నేషనల్ మజ్లిస్ అన్సారుల్లాహ్ ఆమిలా సమావేశం

తదుపరి కార్యక్రమం ప్రకారం, ఆస్ట్రేలియా నేషనల్ మజ్లిస్ అన్సారుల్లాహ్ ఆమిలా సమావేశం హుజూర్ అన్వర్ సమక్షంలో ప్రారంభమైంది. సమావేశం ప్రారంభంలో హుజూర్ దుఆ చేయించారు.

మొదటగా హుజూర్, ఖాయిద్ ఉమూమీ (సెక్రటరీ జనరల్ అఫైర్స్) ను మజ్లిస్‌ల సంఖ్య గురించి అడిగారు. ఆయన సమాధానంగా అన్సారుల్లాహ్‌కు 14 మజ్లిస్‌లు ఉన్నాయని, వాటన్నింటి నుండి క్రమం తప్పకుండా నివేదికలు అందుతున్నాయని తెలిపారు.

దీనిపై హుజూర్ అన్ని నివేదికలను జాగ్రత్తగా చదవాలని, ఫోన్ ద్వారా కాకుండా లిఖిత పూర్వకంగా వ్యాఖ్యలు పంపాలని సూచించారు. ప్రతి నివేదికపై స్పందన ఇవ్వడం తప్పనిసరి అని నొక్కి చెప్పారు.

ఖాయిద్ మాల్ (ఆర్థిక కార్యదర్శి) తన నివేదికను సమర్పిస్తూ, అన్సారుల్లాహ్ సభ్యుల సంఖ్య 411 అని, వార్షిక బడ్జెట్ 92,000 డాలర్లు అని తెలిపారు.

దీనిపై హుజూర్, అనేక మంది అన్సార్ సభ్యులు మంచి ఆదాయం పొందుతున్నారని, అందువల్ల చందా మొత్తాన్ని గణనీయంగా పెంచవచ్చని, అది రెండింతలు అయ్యే అవకాశమూ ఉందని అన్నారు.

తర్వాత హుజూర్ ఖాయిద్ తబ్లీఘ్ (ప్రచార కార్యదర్శి) ను బైఅత్‌ల గురించి అడిగారు. ఖాయిద్ తబ్లీఘ్ సమాధానంగా అన్సారుల్లాహ్ ద్వారా ఎనిమిది బైఅత్‌లు జరిగినట్లు తెలిపారు.

దీనిపై హుజూర్, కొత్తగా చేరిన వారితో నిరంతర సంబంధం కొనసాగించాలని, వారికి తగిన శిక్షణ ఇచ్చి, జమాఅత్ వ్యవస్థలో పూర్తిగా భాగస్వాములను చేయాలని సూచించారు.

హుజూర్ మరల ఇలా సలహా ఇచ్చారు: "ప్రతి సంవత్సరం 25 నుండి 30 బైఅత్‌ల లక్ష్యాన్ని నిర్ధేశించుకొని, ఆ లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయండి."

ఆస్ట్రేలియాలో అనేక జాతుల ప్రజలు నివసిస్తున్నారని హుజూర్ పేర్కొన్నారు. వారిలో తబ్లీఘ్ (ప్రచారం) కోసం పద్ధతిసంబంధిత ప్రణాళికలు రూపొందించాలని, మరిన్ని బైఅత్‌లు సాధించేందుకు కృషి చేయాలని సభ్యులను ప్రోత్సహించారు. సరైన ప్రయత్నం చేస్తే నిర్దేశించిన లక్ష్యాన్ని మించిపోయి మరింత ఎక్కువ బైఅత్‌లు సాధించవచ్చని కూడా తెలిపారు.

తర్బియత్ (నైతిక శిక్షణ) కార్యదర్శి తాను ఈ బాధ్యతను స్వీకరించి ఇప్పటికి కేవలం తొమ్మిది లేదా పది నెలలు మాత్రమే అయ్యిందని తెలిపారు. దీనిపై హజూర్ అన్వర్ ఇలా ప్రశ్నించారు: "ఈ తొమ్మిది, పది నెలల కాలంలో మీరు ఏ పనులు చేశారు?" అందుకు ఆ కార్యదర్శి సమాధానంగా, తాను అన్ని స్థానిక మజ్లిస్‌లకు తర్బియత్ కార్యక్రమాన్ని పంపించి, దానిని అమలు చేయాలని సూచించానని చెప్పారు. అప్పుడు హజూర్ అన్వర్ అడిగారు: "క్రమం తప్పకుండా నమాజులు చేసే అన్సార్ ఎంతమంది ఉన్నారో మీ వద్ద రికార్డు ఉందా?"

దీనికి ఆయన సమాధానంగా, మొత్తం 411 మంది అన్సార్‌లో 272 మంది క్రమం తప్పకుండా నమాజులు చేస్తారని, మిగిలిన వారు క్రమం తప్పకుండా చేయరని తెలిపారు.

(11వ పేజిలో చదవగలరు)

### 131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్ కొరకు 25, 26,27 డిశంబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. ఇప్పటి నుండే జమాఅత్ సభ్యులు ఈ పవిత్ర సభలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సభతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక మహాసభ అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక!

**( నజారత్ ఇస్లాహ్ వ ఇర్షాద్ దక్షిణ భారత దేశపు ఖాదియాన్ )**

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz